స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

RNI No: TELTEL/2024/86684

బుధవారం | 26.03.2025 | సంపుటి : 2 | సంచిక :54 | పేజీలు : 8 | వెల : 2/-

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575



ఎస్ఎల్‌బీసీ ఘటనలో

## మరో మృతదేహం లభ్యం

03



క్రికెట్ బెట్టింగ్‌లో

## డబ్బులు గుల్ల

- ఆత్మహత్య చేసుకున్న యువకుడు
- ఆత్మహత్య పరిష్కారం కాదన్న సజ్జనార్

02

# క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్



## మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు

## ఎవరిని వరిస్తుందోనని చర్చలు?

ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూ స్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైక మాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

**హైదరాబాద్, మార్చి 25 :** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది.

మిగతా 3 లో

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్



- గత తీర్పులను ఎలా కాదనగలమన్న ధర్మాసనం
- స్పీకర్‌కు హైకోర్టు గడువు విధించవచ్చా?
- ఈ అంశాన్ని నిర్ధారించడం వరకే మేం పరిమితం
- ఒక పార్టీ ఎమ్మెల్యే మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీచేయడంపై నిర్ణయం తీసుకోవాల్సింది శాసనసభాపతే.. : జస్టిస్ బీఆర్ గవాయి
- విచారణ ఏప్రిల్ 2కు వాయిదా

**న్యూఢిల్లీ, మార్చి 25 :** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఫిరాయింపుల వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు చర్య తీసుకునేందుకు తగిన సమయం అని చెప్పలేదని.. అలాంటప్పుడు వాటిని కాదని తామెలా వెళ్లగలమని సుప్రీం ప్రశ్నించింది.

మిగతా 2 లో

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐటీ బిల్లు



### సెలెక్ట్ కమిటీ ముందుకు నివేదిక
### ప్రసాదాలపై జీఎస్టీ ఎత్తివేత
### ఆర్థికమంత్రి నిర్మలాసీతారమన్ వెల్లడి

**న్యూఢిల్లీ, మార్చి 25 :** కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చకు చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై చర్చలకు నిర్మలా సీతారామన్ సమాధానం ఇస్తూ, ఫిబ్రవరి 13న సభలో ప్రవేశపెట్టిన కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తోందని తెలియజేశారు. సెలెక్ట్ కమిటీ తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల మొదటి రోజు సమర్పించవలసి ఉంది. 'మేము దానిని వర్షాకాల సమావేశాల్లో చేపడతామని మంత్రి తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలైలో మొదలై ఆగస్టు వరకు సాగుతుంటాయి. కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఆమోదం పొందిన తరువాత డిజిటల్ రికార్డును కూడా మదింపునకు పరిగణనలోకి తీసుకోనున్నట్లు సీతారామన్ చెప్పారు.

మిగతా 2 లో



## ఒకవైపు ఎండలు.. మరోవైపు వర్షాలు

### తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం

**హైదరాబాద్, మార్చి 25 :** తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం కొనసాగుతోంది.. ఓ వైపు ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మరోవైపు అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి.. ఓ వైపు ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు.. రెండు మూడు రోజుల నుంచి తగ్గిన ఉష్ణోగ్రతలతో కాస్త ఉపశమనం పొందుతున్నారు.

మిగతా 2 లో



## పిఎం కిసాన్ సమ్మాన్‌లో అనర్హుల ఏరివేత ప్రక్రియ

- ఇప్పటికే రూ.416 కోట్లు రికవరీ చేశాం
- లోక్‌సభకు వెల్లడించిన మంత్రి చౌహాన్

02

## పంటలు ఎండుతుంటే మిస్ వరల్డ్ పోటీలు హాస్యాస్పదం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, మార్చి 25 :** "రాష్ట్రంలో ఒకవైపు పంటలు ఎండిపోతున్న తరుణంలో రానున్న మే నెలలో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించనుండటం హాస్యాస్పదం. మేం ఓఆర్ఆర్‌ను 33 ఏళ్లకు లీజుకిస్తే తప్పు అన్నారు. కాంగ్రెస్ హయాంలో 99 ఏళ్లపాటు ప్రభుత్వ భూములను లీజుకివ్వడం తప్పు కాదా?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

మిగతా 2 లో

## ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు

### ఏడాదయినా కార్యరూపం దాల్చని పథకం



04

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏడాది కింద ప్రకటిం చారు. అయినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని కెసిఆర్, రేవంత్ ప్రకటిం చినా ఇద్దరూ మాటతప్పారు.



06

## ట్రంప్ 'సోషల్' ప్రతిపాదన

### గ్రీన్‌కార్డుదారుల్లో గుబులు..!



## పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

### కేటీఆర్‌ను హెచ్చరించిన ఎమ్మెల్యే రాజాసింగ్

02

## అప్పట్లో అసెంబ్లీ వేరప్పా



- చంద్రబాబు, వైఎస్ఆర్ స్పీచ్‌లకు ప్రజలు ఫిదా
- టీవీలకు అతుక్కుని వీక్షణం
- ఇప్పుడేమో అందరిలోనూ అనాసక్తి
- బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే మాటలే వస్తున్నాయి
- ఎమ్మెల్యే వివేక్ తో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చిట్ ఛాట్

**హైదరాబాద్, మార్చి 25 :** మాజీ మంత్రి మల్లారెడ్డి ఎప్పుడు ఉన్నది ఉన్నట్టు మాట్లాడటం ఆయన నైజాం. ఆయన పలు విచిత్రంగా స్టేజీలమీద, విలేకరుల సమావేశాల్లో పలు కామెంట్లు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలమీద మంగళవారం కామెంట్ చేశారు. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు.

మిగతా 3 లో



06

జమిలి ఎన్నికలు..

## జేపీసీ గడువు పొడిగింపు



03

## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరో ముగ్గురు మావోల హతం

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి ఎలా రాయగలం అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరవున సీనియర్ న్యాయవాది అరియామా వాదనలు వినిపిస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేపై వేరు వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని.. నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ తరపున లోకసభ ఎన్నికల్లో పోటీ- చేసి ఓడిపోయారని దానం నాగేందర్ గురించి ధర్మాసం దృష్టికి తీసుకొచ్చారు న్యాయవాది. ఆ తర్వాత కూడా బీఆర్ఎస్‌లోనే ఉ న్నామంటున్నారని తెలిపారు. ఫిర్యాదులపై ఏం చేస్తారో... నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయమని మాత్రమే హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని.. అయినప్పటికీ స్పీకర్ పార్టీ మారిన వారికి నోటీసులు ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీ-సు ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రి÷-లపై ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చారన్నారు. ఇప్పటికి మూడు వారాలు అయ్యిందని.. ఆ మూడు వారాలు, నోటీ-సులు ఎటు-వెళ్లాయో తెలీదని కౌశిక్ రెడ్డి న్యాయవాది తెలిపారు. తాము ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని.. ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని న్యాయవాది సుందరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా అని న్యాయమూర్తి



జస్టిస్ గవాయ్ నవ్వుతూ చెప్పారు. స్పీకర్ క్వాషి జ్యూడిషియరీ అధికారాలతో ఉన్నారని.. రాజ్యాంగ పరిరక్షణకు కట్టు-బడి ఉ ండాలని.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని న్యాయవాది సుందరం తెలిపారు. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అలాంటి సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. స్పీకర్ క్వాషీ జ్యూడిషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరించాలన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని... కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామన్న న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు కూడా స్పీకర్‌ను తగిన సమయం అని స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని.. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేం కదా అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం అభిప్రాయపడింది. న్యాయవాది సుందరం మాట్లాడుతూ... తగిన సమయం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయన్నారు. కానీ, మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుందని... కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని తెలిపారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదని.. నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో.. అనర్హత వేటు-పడిందని ఆర్యామ సుందరం వెల్లడించారు. మరో కేసులో... తగిన సమయం అంటే నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటు-ందనిని చెప్పిందని చెబుతూ.. పాడి కౌశిక్ రెడ్డి తరపున న్యాయవాది అరియామా సుందరం వాదనలను ముగించారు. అనంతరం తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ తరపు వాదనలు ముగియ గా.. తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

## పిఎం కిసాన్ సమ్మాన్‌లో
# అనర్హుల ఏరివేత ప్రక్రియ

- ఇప్పటికే రూ.416 కోట్లు రికవరీ చేశాం
- లోక్‌సభకు వెల్లడించిన మంత్రి చౌహాన్

**న్యూఢిల్లీ, మార్చి 25 :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అనర్హుల ఏరివేతను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్నవారు అనర్హులు. అయితే దీనికింద లబ్ధిపొందితే వారి నుంచి రికవరీ చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. ఈ పథకం ద్వారా లబ్ధిపొందే రైతుల కోసం రిజిస్ట్రేషన్ పక్రియ నిరంతరం కొనసాగు తుందని, పీఎం-కిసాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో స్వయంగా రిజిస్టర్ చేసుకోవచ్చని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. దీనిని రైతులకు ఉపయుక్తంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోన్నది. ఈ క్రమంలో ఇప్పటి వరకు అనర్హుల నుంచి రూ.416 కోట్లు రికవరీ చేసినట్లు-శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6వేలను మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 19 విడతల్లో రూ.3.68లక్షల కోట్లు- రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ పథకం ప్రారంభంలో స్వీయ ధ్రువీకరణ ఆధారంగా లబ్ధిదారుల పేర్ల నమోదుకు అనుమతించారు. ఇప్పటికే 100శాతం ఆధార్ సీడింగ్ పూర్తిచేయగా.. ఆధార్, ఆదాయపన్ను శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖల వద్ద ఉన్న సమాచారంతో అనర్హులను ఏరివేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో గుర్తించిన అనర్హుల పేర్లను బట్టి వారి నుంచి రికవరీ చేస్తున్నారు

# విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం

- రిక్రూట్‌మెంట్లు పెరిగినా.. డ్రాపౌట్స్ పెరగడమేమిటి
- ప్రభుత్వ తీరును నిలదీసిన బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి
- తమ హయాంలో విద్యావ్యవస్థను పటిష్టం చేశామన్న హరీష్ రావు

**హైదరాబాద్, మార్చి 25 :** టీచర్ల రిక్రూట్‌మెంట్ జరిగినా.. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ పెరగడం ఏమిటని తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ పద్దులుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా వాడీవేడి చర్చ సాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 26 వేల మందిని మాత్రమే రిక్రూట్ చేసిందని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే క్రెడిట్ తీసుకుంటుందని రాకేశ్ రెడ్డి విమర్శించారు. అంతమందిని రిక్రూట్ చేశారని చెబుతున్నారు. కానీ గతంలో ఒక్కటే కాలేజీ ఉండేది. ఇప్పుడు 100కు పెరిగాయి. కానీ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాలు ఇంకా గణనీయంగా అభివృద్ధి చెందలేదని ఆయన అన్నారు. ఆయన తన ప్రసంగంలో విద్యా వ్యవస్థలో ఏర్పడిన లోపాలను ఎత్తిచూపారు. పదేళ్లలో 6,000 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని, గత ఏడాది లోపలే 1,800 స్కూళ్లు మూతపడిన విషయం గమనార్హమని చెప్పారు. అప్పుడు బంగారు తెలంగాణ అని చెప్పారు, ఇప్పుడు వజ్రాల తెలంగాణ అంటున్నారు. కానీ విద్యా రంగం మాత్రం దిగజారిపోతోంది. 1931 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా ఉన్నాయి. ఇన్ని వేల కోట్ల బడ్జెట్ పెట్టినా పరిస్థితి మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. స్కూళ్లలో ఒకటే బాత్రూం ఉంటుంది, అక్కడ పందులు తిరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఎలా ప్రభుత్వ స్కూళ్లలో చదవగలరని అన్నారు. తల్లిదండ్రులు అప్పు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాలని పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉంది. కానీ సీఎం దగ్గర చాలా పనులు ఉ ంటాయి. కాబట్టి ఈ శాఖను మరొకరికి అప్పగిస్తే మంచిది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని మెరుగుపరిచే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకపోతే డ్రాప్ ఔట్స్ సంఖ్య ఇంకా పెరుగుతుందని ఎమ్మెల్యే సూచించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సీనియర్ సభ్యుల సూచనలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రి-టైర్డ్ ఆఫీసర్ల సహాయంతో పాఠశాలల నిర్వహణను మెరుగుపర్చాలన్నారు రాకేశ్ రెడ్డి. స్కూళ్లకు కాంపౌండ్ వాల్, శుభ్రమైన వసతులు కల్పించాలని, బడ్జెట్ కేటాయింపులను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాల న్నారు. ఇకపోతే ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉ ద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

# మొత్తం 35 సవరణలకు అనుమతి

### లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ, మార్చి 25 :** ఆన్‌లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం పక్రియ లోక్‌సభలో పూర్తయింది. ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది. రాజ్యసభ కూడా ఆమోదిస్తే 2025-26 బడ్జెట్ ఆమోదం పక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లు-మాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు-కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వాటా, గ్రాంట్లు-, రుణాలు, కేంద్రం ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు-. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు- 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు- 4.8 శాతంగా అంచనావేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) రూ. 3,56,97,923 కోట్లు-గా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జిడీపీ రూ. 3,24,11,406 కోట్లు. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిడిపీ 10.1 శాతం ఎక్కువగా ఉ ంటుందని అంచనా.

# ఒకవైపు ఎండలు.. మరోవైపు వర్షాలు



(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అలాగే.. కొన్ని ప్రాంతాల్లో ద్రోణి ప్రభావం తో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.. తెలంగాణలో 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశ ముం దని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్ ఘడ్ నుండి మధ్య మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక మీదుగా ఉత్తర కేరళ వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతు ందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుంది.. ఆ తరువాత క్రమేపి రెండు నుండి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ రోజు గరిష్టంగా అదిలాబాద్ లో 38.3 కనిష్టంగా హైదరాబాద్ లో 33.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోద య్యాయి. ఆదిలాబాద్.. 38.8, నిజామా బాద్.. 37.8, భద్రాచలం..37.2, ఖమ్మం.. 37.2, మహబూబ్ నగర్.. 35.6, నల్లగొండ..35.5, రామగుండం.. 35, మెదక్.. 34.6, హనుమకొండ..34.5, హైదరాబాద్.. 33.6 డిగ్రీల పగలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. ఏపీలో ఠారెత్తిస్తున్న ఎండలు.. మంగళవారం ఏపీలోని 52 మండలాల్లో వడగా ల్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. నేడు శ్రీకాకుళం జిల్లా -8, విజయనగరం జిల్లా-10, పార్వతీపురంమన్యం జిల్లా-12, అల్లూరి సీతారా మరాజు జిల్లా-6, కాకినాడ-5, తూర్పుగోదావరి-6, ఏలూ రు-2, ఎన్టీఆర్ జిల్లా 3 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉంది. సోమవారం అనంతపురం జిల్లా నాగసముద్రంలో 39.9, వైఎస్సార్ జిల్లా అట్లూరు 39.8, చిత్తూరు జిల్లా నింద్ర 39.7, నంద్యాల జిల్లా దొర్నిపాడు 39.6, ప్రకాశం జిల్లా గుంటుపల్లి 39.2 అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. అలాగే మూడు మండలాల్లో వడగాల్పులు వీచాయి. వేసవి అకాల వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమరా వతి వాతావరణ కేంద్రం సూచించింది.

# క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు గుల్ల

- ఆత్మహత్య చేసుకున్న యువకుడు
- ఆత్మహత్య పరిష్కారం కాదన్న సజ్జన్నార్

**హైదరాబాద్, మార్చి 25 :** మేడ్చల్ జిల్లా గౌడవెల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల సోమేశ్ క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమేశ్ తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని తన కొడుకు సోమేశ్ తెల్లవారు 4గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తమ ఇంటి సమీపంలోని గౌడవెల్లిలో రైల్ ట్రాక్ పై పడుకొని ఆత్మహత్య చేసుకున్నడన్నారు. లక్షల్లో సోమేశ్ క్రికెట్ బెట్టింగ్ పెట్టాడని తెలిపారు. గతంలో తమ కూతురు వివాహం కోసం సోమేశ్ అప్పు చేశాడని అప్పు తీర్చామన్నారు. అందరితో బాగానే మాట్లాడాడని.. రాత్రి ఏం జరిగిందో? ఎవరు టార్చర్ చేశారో తెలియదన్నారు. మనోవేదనకు గురై సోమేశ్ సూసైడ్ చేసుకున్నాడని.. తమకు కడుపుకోత మిగిల్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన ఈ అన్యాయం ఎవరి కుటుంబంలో జరగకూడదని ఆ తల్లిదండ్రులు తెలిపారు. బెట్టింగ్ యాప్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సోమేశ్ చనిపోయే ముందు స్నేహితులకు వాట్సప్‌లో లొకేషన్ షేర్ చేశాడని.. తామంతా లొకేషన్ కి వెళ్లేసరికి మృతదేహం పడి ఉందని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషాద ఘటనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సమస్య ఏదైనా సరే.. ఆత్మహత్య అనేది పరిష్కారం కాదు అని యువతకు



సూచించారు. బెట్టింగ్ భూతాన్ని పూర్తిగా నిర్మూలించడానికి సజ్జనార్ అవిరామ కృషి చేస్తున్న విషయం తెలిసిందే. సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో ఈవిధంగా రాసుకొచ్చారు. 'ఆన్ లైన్ బెట్టింగ్ భూతానికి వ్యసనపరులై బలవన్మరణాలకు పాల్పడకండి. ఆలోచించండి.. మీరు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల మీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంతటి క్షోభను అనుభవిస్తారో ఆలోచించండి. సమస్య వచ్చినప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలో అన్వేషించాలే తప్ప.. చనిపోవాలనే ఆలోచనే రాకూడదు. ఉన్నది ఒక్కటే జీవితం. ఏం సాధించిన అందులోనే. జీవన ప్రయాణంలో ఒక్కసారి కిందపడితే.. సర్వం కోల్పోయినట్లు- కాదు కదా. అమూల్యమై న జీవితాన్ని అర్ధాంతరంగా కాలదన్నుకోవద్దు. చీకటి వెలుగులా నిత్యం కష్టసుఖాలు అందర్నీ వెంటాడుతూనే ఉ ంటాయి. కష్టకాలంలో బాధలను ఇతరులతో పంచుకోవాలి. పరిష్కార మార్గాలు వెతకాలి. ఎంత కష్టం వచ్చినా ఎల్లకాలం ఉంటు-ందా? చనిపోయినంత మాత్రాన సమస్యలు టక్కున మాయమవుతాయా!?.. బలవన్మరణం వద్దు.. బతికి సాధించడమే ముద్దు' అని యువతకు సూచించారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐటీ బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

1961 చట్టంలో డిజిటల్ ప్రస్తావన లేనందున అది తరచు వివాదాస్పదం అవుతోందని, జనం కోర్టును ఆశ్రయించి, పాస్‌కోడ్‌ను పంచుకోకుండా రక్షణ కోరుతున్నారని ఆమె తెలిపాను. 'అందువల్ల డిజిటల్ ఒక వివాదంగా మారుతోంది. ఇప్పుడు ఉన్న ఆ లోటును కొత్త ఆదాయపు పన్ను బిల్లులో భర్తీ చేస్తున్నాం. బిల్లు సెలెక్ట్ కమిటీ- ముందు ఉందని ఆమె చెప్పారు. తనిఖీ, స్వాధీనం కేసుల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడి ఖతాలు సహా వర్చువల్ డిజిటల్ స్పేస్, కంప్యూటర్ సిస్టమ్‌ల అందుబాటు- కోడ్‌ను అధిగమించే అధికారాలను పన్ను అధికారులకు కొత్త బిల్లు దత్తం చేస్తుంది. 1961 ఆదాయపు పన్ను చట్టం పరిమాణంలో సగం ఉన్న సరళీకృత ఆదాయపు పన్ను బిల్లు దావా అవకాశాన్ని, కొత్త అన్వయాన్ని కనిష్ఠ స్థాయికి చేర్చడం ద్వారా పన్నును కచ్చితత్వం చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ ఇంతకు ముందు తెలియజేసింది. తయారీ రంగానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలాసీతారామన్ వివరించారు. వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్ను ను కూడా రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అస్థిర పరిస్థితులను తొలగించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025 కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇదీ ఉంది. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# పంటలు ఎండుతుంటే మిస్ వరల్డ్ పోటీలు హాస్యాస్పదం : కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... "మిస్ వరల్డ్, మిస్ ఇండియాలాంటి పోటీలకు గతంలో ఉన్న ఖ్యాతి ఇప్పుడు లేదు. ఏదో ఘనత సాధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. మేం రూ.46 కోట్లతో ఫార్ములా ఈ కార్ రేస్ పోటీలను నిర్వహించడం తప్పయితే... రూ.54 కోట్లతో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడం ఎలా ఒప్పవుతుంది? ఫార్ములా-ఈ రేస్‌తో ప్రభుత్వానికి రూ.700 కోట్ల ఆదాయం వస్తే... రెండో విడతను రద్దు చేయడం ఎంతవరకు సమంజసం? గత పదేళ్లలో రాష్ట్రంలో సాంస్కృతికంగా, పర్యాటకపరంగా ఏమీ జరగలేదని మంత్రి జూపల్లి అంటున్నారు. కానీ, భారాస హయాంలోనే 550 మంది కళాకారులకు వేతనంతో కూడిన ఉపాధి కల్పించాం. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తెప్పించగలిగాం. కులీకుతుబ్‌షాల టూంబ్‌లను, మొజాంజాహీ మార్కెట్‌ను, ముర్గీచౌక్, మీరాలం చెరువును బ్రహ్మాండంగా తీర్చిదిద్దాం. యాదాద్రిని అద్భుతంగా కట్టించింది కేసీఆర్ ప్రభుత్వమే. ఎకో, మెడికల్, ఎడ్వెంచర్ టూరిజంలను ప్రోత్సహించాం. బుద్ధవనం ప్రాజెక్టును ఏర్పాటు చేశాం. సోమశిలలో కాటేజీలు, వరంగల్ కాళోజీ కళాక్షేత్రం మా ఘనతే. గోరటి వెంకన్న, రసమయి, దేశ్‌పతిలాంటి కళాకారులను కేసీఆర్ చట్టసభలకు పంపారు. భారాస హయాంలో నిర్మించిన అంబేడ్కర్ మ్యూజియాన్ని ఎందుకు తెరవడంలేదు. ఏప్రిల్ 14లోగా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలి' అని సూచించారు.

# ఘటకేశ్వర్ రైల్వే బ్రిడ్డికి తొలగిన అడ్డంకులు

## 50లక్షలు మంజూరు చేసిన భట్టి

**హైదరాబాద్, మార్చి 25 :** మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చొరవతో ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనులకు నిధులు మంజూరయ్యాయి. అర్ధాంతరంగా పనులు నిలిచిపోయి పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనుల నిమిత్తం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.50లక్షలను మంజూరు చేశారు. దీనిపట్ల ఘట్‌కేసర్ జేఏసీ, మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాజీ మంత్రి మల్లారెడ్డినికి కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో డిప్యూటీ- సీఎం భట్టివిక్రమార్కను మల్లారెడ్డి కలిసి సమస్యను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క.. రూ.50 లక్షలను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరు చేయడం పట్ల భట్టి విక్రమార్క, మల్లారెడ్డికి ఘట్‌కేసర్ జేఏసీ చైర్మన్ మారం లక్ష్మారెడ్డి, సభ్యులు, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి మల్లారెడ్డి చొరవతోనే బ్రిడ్జ నిర్మాణం 80 శాతం పూర్తయిందని తెలిపారు. తన సొంత నిధులను కూడా బ్రిడ్జ నిర్మాణానికి కేటాయించడం ఆయన గొప్పతనానికి నిదర్శనం కొనియాడారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేంతవరకు సహకారం అందిస్తారని జేఏసీ, బీఆర్ఎస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# అప్పట్లో అసెంబ్లీ వేరప్పా

(మొదటిపేజీ తరువాయి)

గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది. పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజుపేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ



కామెంట్స్ సంచలనంగా మారాయి. ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. మంగళవారం అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. దీంతో వీరిద్దరి పలుకరింపులు ఆసక్తిగా మారాయి.

## ఓయూ ఆంక్షలపై చర్చించండి..

### బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలపై అసెంబ్లీలో చర్చించాలంటూ బీఆర్ఎస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. దీనిపై శాసనసభలో చర్చించాలని ప్రతిపాదించింది. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శికి వాయిదా తీర్మానం అందించింది. ఎన్నో ఉద్యమాలకు వేదికైన ఉస్మానియా యూనివర్సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పోరాటాలకు ఊపిరిలూదిన విద్యార్థిలోకంపై కక్షగట్టింది. ఏకంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ఆవంఇలో ఆందోళనలపై ఈ నెల 15న నిషేధం విధించింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులపై ఆనాటి పాలకులు ఊరూరా ఉక్కుపాదం మోపుతున్న తరుణంలోనూ ఓయూ విద్యార్థి ఉద్యమంపై ఎలాంటి నిషేధాజ్ఞలు విధించలేదు. కానీ, నేడు 'ప్రతికూల ప్రభావం' అంటూ సాకుగా చూపి రేవంత్ సర్కారు అణచివేత చర్యలకు దిగింది. వర్సిటీలో అన్నిరకాల ధర్నాలు, నిరసన ప్రదర్శనలపై నిషేధం విధిస్తూ శనివారం ఓయూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత ఉస్మానియాపై ఇలాంటి నిషేధాజ్ఞలు విధించడం విపరిణామమే. వర్సిటీ అధికారుల ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, దాని విభాగాలు, కళాశాలలు, కేంద్రాలు, పరిపాలనా భవనాల్లో ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిషేధిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి ఈ సర్క్యులర్ జారీ చేశారు. నిరసనలు యూనివర్సిటీ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు పరిపాలన, విద్యా పురోగతిని జాప్యంచేసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో భద్రతా సమస్యలు సైతం తలెత్తాయని తెలిపారు. వర్సిటీ భవనాల్లోకి అనధికారికంగా ప్రవేశించడం, ధర్నాలు, ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించకుండా నిరోధించడం, వర్సిటీ ఉద్యోగులు, అధికారులపై అభ్యంతరకరమైన భాషను వినియోగిస్తూ దూషించడాన్ని సంపూర్ణంగా నిషేధించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూనివర్సిటీ విద్యార్థులకు ఏదైనా ఫిర్యాదులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించడం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

## స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు బాధ కలిగించాయి : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయని నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. తాను ఏం తప్పు చేశానని, మీకు ఎందుకు అలా వినాలనిపించలేదని స్పీకర్‌ను ప్రశ్నించారు. విషయంపైనే మాట్లాడానుతప్ప ఎక్కడా పరిధి దాటలేదన్నారు. అయినా తనను అలా వినబుద్ధికావడం లేదని ఎలా అంటారన్నారు. తనపై వ్యాఖ్యలను స్పీకర్ ఉపసంహరించుకోవాలన్నారు. శాసనసభలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. "సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుందని తెలిపారు. నిన్న మీరు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని పేర్కొన్నారు. తాను మాట్లాడుతున్న సందర్భంలో సబ్జెక్టునుంచి ఎక్కడా డీవియేట్ కాలేదు. మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై మాట్లాడుతానని ముందే సమాచారం ఇచ్చానన్నారు. అవకాశం కోసం సాయంత్రం వరకు నిరీక్షించా. రాత్రి 8 గంటలకు మాట్లాడేందుకు తనకు అవకాశం కల్పించారన్నారు. రెండు నిమిషాల్లో పూర్తిచేయాలన్నారు. తాను మాట్లాడుతుండగా.. నాకే వినబుద్ధి అవడలేదని, మీరంతా ఎలా వింటున్నారో అని మీరు అనడం నాకు చాలా బాధకలిగించింది. ఒక మహిళగా, సీనియర్ సభ్యురాలినైనా తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ మాట్లాడలేదని.. ఎందుకంటే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులు అంతా మాట్లాడినప్పటికీ.. జీరో అవర్‌లో ఒకటే సబ్జెక్ట్ మాట్లాడాలని, అసభ్య పదజాలం మనం ఉపయోగించకూడదని కొత్తగా వచ్చిన మా సభ్యులకు చెబుతానని తెలిపారు. ఒకరికి చెప్పగలిగిన స్థాయిలో ఉన్న తనను మీరు మాట్లాడిన మాటలు చాలా బాధ కలిగించాయని ఆవేదన వ్యక్తంచేశారు. సబ్జెక్టును మించి ఒక విషయం కూడా బయటకు జరుగలేదు. అలాంటి సమయంలో మీరు మాట్లాడిన మాటలు నాకు బాధ కలించాయి. సభలో నిరసనల మధ్య తనకు సరిగా వినపడలేదని, వాకౌట్ చేసి బయటకు వెళ్లిన తర్వాత మా సభ్యులు చెప్పారు. తాను తప్పేంమాట్లాడానో చెప్పండి. నా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడానే తప్ప మరో విషయం కాదు. మీ వ్యాఖ్యలు మంచిగనిపిస్తే రికార్డుల్లో కొనసాగించండి. లేదంటే ఉపసంహరించుకోవాలి. సభాపతిగా మా



హక్కులు కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌ది. అధికార పక్షానికి నచ్చకపోతే బాగాలేదని చెప్పాలి. గతంలో కూడా మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారని, అయినప్పటికీ నిలుచుని మానంగా నిరసన తెలిపాం. ఇలాంటివి మరోసారి జరగకూడదని, సభా సంప్రదాయాలకు మంచిదికాదు' అని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు లక్ష్మారెడ్డి సూచించారు. కాగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలంటే తనకు ఎనేలని గౌరవం ఉందన్నారు. తనకు 8 మంది సోదరీమణులు ఉన్నారని, మహిళలను గౌరవిస్తానని చెప్పారు. 'మిమ్మల్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు. తాను ఈ సీటు మీద ఉండి తమను అన్నానని అనుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడేటప్పుడు ఇరువైపులా నుంచీ రన్నింగ్ కామెంట్ వస్తున్నదన్నారు. దీంతో వారు మాట్లాడేది నాకే వినబుద్ధి అవుతలేదని తెలిపారు. మీకు వినబడుతున్నదా అని అన్నాను. మిమ్మల్ని ఉద్దేశించి అలా అనలేదు. మీ మనసు కష్టపడితే ఆ వ్యాఖ్యలను విత్‌డ్రా చేసుకుంటున్నాను.' అని చెప్పారు.



## ఎస్ఎల్‌బీసీ ఘటనలో

# మరో మృతదేహం లభ్యం

**మహబూబ్‌నగర్, మార్చి 25 :** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళ్లు వారి ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్‌కు 40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. రెస్క్యూ బృందాలు దుర్వాసన వస్తుండడంతో స్ప్రే బాటిల్స్ తీసుకొని లోపలికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి టిబిఎం మిషన్ పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించడం, మృతదేహం చుట్టూ భారీగా పేరుకుపోయిన శకలాలు, మట్టి బురద తొలగించడం లాంటి సహాయక చర్యలు వేగవంతం చేసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. అనంతరం డెడ్‌బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం డెడ్‌బాడీని మనోజ్ కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

## అర్ధరాత్రి బిర్యానీ సెంటర్‌లో పేలుడు

### ఘటనపై విచారణ చేస్తున్న పోలీసులు

**నల్లగొండ, మార్చి 25 :** ఓ బిర్యానీ సెంటర్‌లో అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించడంతో చుట్టుపక్కలవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులోని పూజిత అపార్ట్మెంట్ ఎదురుగా ఉన్న హాట్ బకెట్ బిర్యానీ సెంటర్‌లో చోటుచేసుకుంది. పేలుడు ధాటికి షెటర్ గేటుతోసహా లోపల ఉన్న సామాన్లు రోడ్డుపై చెల్లా చెదురుగా పడ్డాయి. అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. పేలుడుకు గల కారణాలు తెలియరాలేదు. అయితే గ్యాస్ సిలిండర్ పేలిందా లేదా షార్ట్ సర్క్యూట్ అయ్యిందా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. రంజాన్ మాసం సందర్భంగా అర్ధరాత్రి వరకు షాప్ తెరిచే ఉన్నదని, షాప్ బంద్‌చేసిన 15 నిమిషాలకు ఈ పేలుడు జరిగినట్లు పోలీసులు తెలిపారు. గ్యాస్ సిలిండర్ అయితే ఏమీ పేలలేదని, మరేదైనా కుట్ర కోణం దాగి ఉందా అని పోలీసులు ఆరాతీస్తున్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు సవాల్

### తప్పుడు లెక్కలపై నిలదీత



**హైదరాబాద్, మార్చి 25 :** కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర అన్నీ తప్పుడు లెక్కలే ఉన్నాయని, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలపై అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

## పోలీసు విచారణకు రీతుచౌదరి గైర్హాజరు

### కోర్టును ఆశ్రయించిన విష్ణుప్రియ



**హైదరాబాద్, మార్చి 25 :** బెట్టింగ్ యాప్స్‌పై విచారణ కొనసాగుతుంది. ఈక్రమంలో బెట్టింగ్ యాప్స్ వ్యవహారానికి సంబంధించి తమ ఎదుట విచారణకు రావాలంటూ రీతూ చౌదరి, విష్ణుప్రియకు ఇప్పటికే పోలీసులు నోటీసులు ఇచ్చారు. గత గురువారం ఇద్దర్నీ కూడా పోలీసులు విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అలాగే మరోసారి విచారణకు రావాలని ఇద్దరికి సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలంటూ చెప్పగా... ఇప్పటి వరకు విష్ణుప్రియ, రీతూ చౌదరి విచారణకు రాలేదు. ఓవైపు విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చినప్పటికీ యాంకర్ విష్ణుప్రియ మాత్రం హైకోర్టులో పిటిషన్ వేశారు. తనపై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బెట్టింగ్ వ్యవహారానికి సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయని, ఈ రెండింటినీ క్వాష్ చేయాలంటూ హైకోర్టులో యాంకర్ పిటిషన్ వేశారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత విష్ణుప్రియ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు విష్ణుప్రియ విషయంలో ముందుకు వెళ్లాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే యూట్యూబర్ రీతూ చౌదరిని కూడా విచారణకు రావాల్సిందిగా పంజాగుట్ట పోలీసులు స్పష్టం చేయగా.. ఇప్పటి వరకు కూడా ఆమె విచారణకు రాలేదు. గతంలో విచారణకు రావాలని నోటీసులు ఇచ్చినప్పుడు కూడా రీతూ చౌదరి మూడు గంటలకు హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని చెప్పినప్పటికీ రీతౌ చౌదరి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలో ఆమెకు మరోసారి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌లో మరో ముగ్గురు మావోల హతం

**రాయపూర్, మార్చి 25 :** ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులను మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు దంతెవాడ, బిజాపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న అడవిలో ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో కాల్పులు జరిపారు. మావోయిస్టులకు, భద్రతా దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు తుపాకులను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఆపరేషన్ కొనసాగుతుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు తెలిపారు. కాగా, ఈ నెల 20వ తేదీన బీజాపూర్, కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

## అసెంబ్లీకి ముట్టడికి యత్నించిన న్యాయవాదులు

### అడ్డుకున్న పోలీసులు

**హైదరాబాద్, మార్చి 25 :** తెలంగాణ అసెంబ్లీ దగ్గర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. నిన్న న్యాయవాది హత్య ఘటనపై నిరసనగా అసెంబ్లీ ముట్టడికి న్యాయవాదులు యత్నించారు. అడ్వేకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వైపు దూసుకువెళుతున్న న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, న్యాయవాదుల మధ్య తోపులాట జరిగింది. గన్‌పార్క్ వద్ద న్యాయవాదులను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసలు తెలిపారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరు గుతున్న నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడికి న్యాయవాదులు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. గన్‌పార్క వద్ద నిరసన తెలియజేయడానికి వచ్చిన సమయంలో న్యాయవాదులు.. పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎర్రబాపు ఇజ్రాయెల్ అనే న్యాయవాదిని ప్రత్యర్థి కక్షిదారు హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హైకోర్టు బార్ అసోసియేషన్ పేర్కొంది. ఇందుకు నిరసనగా మంగళవారం హైకోర్టులో విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొంది. అయితే హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది.

# క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్



(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ విన్పించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండదండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. అల్రెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిర్‌బీ తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుండొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్‌లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటేషన్ ఎక్కువగానే ఉంది. లైన్‌లో అలా ఎందరో ఆశవహులు ఉన్నారు. మరి వారిలో కేబినెట్ బెర్త్ చేజిక్కించుకునే ఆ నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్‌లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటేషన్ నేపథ్యంలో రాజపూజ్యం-అవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్‌లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.

## పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

### కేటీఆర్‌ను హెచ్చరించిన రాజాసింగ్

**హైదరాబాద్, మార్చి 25 :** ఏ పార్టీ అధికారంలో ఉంటే వారు చెప్పిన విధంగానే పోలీసులు వింటారని, పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని అన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని ఎవరు అధికారంలో ఉంటే వాళ్లు చెప్పిన విధంగా పోలీసులు లీగల్‌గానే పనిచేస్తారని... ఆ విషయం మర్చిపోయారా కేటీఆర్ అని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి పోలీసులు జైలుకు పంపిస్తున్నారని... బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్‌కు చూశారన్నారు. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు కూడా



పంపించారని రాజా సింగ్ గుర్తుచేశారు. అయితే ఇందులో షాకింగ్ విషయం ఏంటంటే.. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించే సమయంలో సొంత పార్టీ నేతలు, కొంతమంది బీజేపీ అధికారులు.. పోలీసులకు మద్దతుగా నిలిచారన్నారు. ఈ విషయాన్ని ఓ పోలీస్ అధికారే స్వయంగా తనతో చెప్పారన్నారు. అయితే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. తనను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, బీజేపీ అధికారులను ఏం చేయాలని ప్రశ్నించారు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

**సంపాదకీయం**

# కానరాని ఆర్థిక పునరుత్తేజం!



ఆర్థిక పునరుత్తేజం కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వేసుకున్న లెక్కలు తలకిందులు అయ్యాయి. క్షీణిస్తున్న రూపాయి విలువతో ఈ ఏడాది ఆసియాలోకెల్లా బాగా దెబ్బతిన్న కరెన్సీ ఇప్పుడు మనదేననడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక, స్టాక్‌మార్కెట్ కష్టాలు సరేసరి. ఈ మధ్య అవి కూడా తలకిందులు అవుతున్నాయి. భారత్ ఇప్పుడు ఆర్థిక, వాణిజ్య లోటులు రెంటినీ ఎదుర్కొంటోంది. జాతీయ, అంతర్జాతీయ ధరలు పెరుగుతుండడంతో దేశంలో ద్రవ్యోల్బణంపై తన వైఖరిని భారత రిజర్వ్ బ్యాంక్ పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ధరలు ఇలానే పెరుగుతూ పోతే, వృద్ధిపై గట్టి దెబ్బ పడుతుంది. ఆర్బీఐ తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోకుండా చూడాలి. ప్రజల్లో ఆర్థిక లావాదేవీలు పెరగాలి. సత్వర కార్యాచరణ చేపట్టడం ద్వారా ప్రజలకు పనులు కల్పించే పనులు చేయాలి.ప్రజల్లో రూపాయి చలామణి అయ్యేలా చేయాలి. ఉత్పత్తి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ధాన్యం నిల్వలు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా చేస్తే తప్ప ఆర్థిక రంగం బలపడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే దేశంలో ఆర్థిక విధానాలు నానాటికి దిగజారుతున్నాయి. కేవలం పన్నులు మీద ఉన్న శ్రద్ధ మరోదానిపై కనిపించడం లేదు. ప్రతిదీ పన్నుల కింద జమకట్టం, బ్యాంకుల వడ్డింపులు, వడ్డీల తీరు కారణంగా సామాన్యులకు జీవించడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఉన్నది పన్నులు వసూలు చేయడానికి తప్ప ప్రజల కోసం కాదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రుజువు చేసుకున్నాయి. డిల్లీలో కూర్చుని లెక్కలు వేయకుండా ప్రజల ఆర్థిక స్థితిగతులను లెక్కలు వేస్తే ఆర్థిక పరిస్థితి ఏంటన్నది చూడాలి.

బంగారం కొనడానికి లేదు. పుస్తెలు చేయించాలంటేనే భయపడే రోజులు దాపురించాయి. అదేపనిగా బంగారం,వెండిధరలు పెరిగి పోతున్నాయి. భూములు అందుబాటులో లేవు. అలాగే ఇళ్లు కట్టుకునే వీలు లేదు. ఆహార ధాన్యాలు కొనే ధైర్యం లేదు. తిండి తినడం కూడా భయంగా మారింది. బ్యాంకులు ఎగవేతదారులను వదిలి సామాన్యుల వెంట పడుతున్నాయి. ఇలా అన్ని విధాలా ధరలు పెరిగిపోతున్నా..పాలకులు పట్టించు కోవడం లేదు. సరికదా అభివృద్ధికి ఇదే సూచిక అని చంకలు గుద్దుకుంటున్నారు పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు కూడా ప్రజల జీవనంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచమంతటినీ తాకుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా మనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్కడి సెగ ఇక్కడి మన స్టాక్ మార్కెట్లు, మదుపరులు, ఆర్థిక విధాన నిర్ణేతలు ఇలా ప్రతి ఒక్కరికీ తగులుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడనుంది. ఇప్పటికే స్టాక్ మార్కెట్ల పతనం, ఎన్నడూ లేనట్టు డాలర్‌కు 85 రూపాయల స్థాయికి కరెన్సీ విలువ క్షీణించడం, పెరగనున్న చమురు ధరలు వెక్కిరిస్తున్నాయి. అనేక అవాంతరాల మధ్య క్రమంగా కోలుకుంటోందని భావిస్తున్న దేశ ఆర్థికరంగం రానున్న రోజుల్లో ఇంకెంత ఒత్తిడికి గురవుతుందోనని ఆందోళన కలుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతుండడం మన ఆర్థిక విధాన నిర్ణేతలకు సవాలు కానుంది.

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోతోంది. చమురుకు తోడు వంటనూనెలు ఉన్నాయి. ప్రపంచం లోసన్‌ఫ్లవర్ నూనెలో అయిదింట నాలుగొంతులు రష్యా, ఉక్రెయిన్‌ల ఉత్పత్తి కావడం గమనించాలి. మన సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతుల్లో 90 శాతం ఆ రెండు దేశాల నుంచే వస్తాయి. పామాయిల్, ఆవనూనెల ధరలు ఇప్పటికే పైకి చూస్తున్నాయి. మన దగ్గర ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా వాణిజ్య పరంగా వాటిని ఎగమతులు చేసుకునే వ్యూహాలు కానరావడం లేదు. పసుపు, మిర్చి,అల్లం, వెల్లుల్లి, బియ్యం, పత్తి వంటి వాణిజ్య పంటలను అత్యధికంగగా ఎగుమతి చేసుకునే విధానాలు రూపొందాలి. మన ఎగుమతులను సమీక్షించకుండా అదే పనిగా దిగుమతులు పెరిగితే ద్రవ్యోల్బణం పెరగడమే గాకుండా రూపాయి మారకవిలువ కూడా పెరగడం ఖాయం. వంటనూనెలు మరింత ప్రియం కానున్నాయి. కీలకమైన ఈ ఇంధనాల ధరలు ఇలా పెరిగిపోతుండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. ధరలు ప్రజల శక్తికి మించి పెరుగుతున్న చోట సామాజిక సంక్షోభం తలెత్తనుంది. నిత్యావసర సరకులు కొనుక్కోలేని అశక్తత ఏర్పడి అది అశాంతిని సృష్టించి వీధుల్లో అలజడికి కారణం అవుతుంది. ఈ కారణంగగా మన దేశీయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం తప్పనిసరి. అలాగే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా ఆర్థిక కార్యకలాపాలు సాగాలి. ఎగుమతులను పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలి. అమ్మకాలతో లాభం లేదని గుర్తించాలి. ఇవేవీ చేయ కుండా ఎన్ని కసరత్తులు చేసినా లాభం లేదని గమనించాలి. ఆర్తిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకముందే పాలకులు మేల్కోవాలి. లేకుంటే పరిస్థితి సామాజిక సంక్షోభానికి దారితీయగలదని గుర్తించాలి. మనం పండిస్తున్న మిర్చి, పసుపు, పత్తి లాంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి. ఇక్కడి ఉత్పత్తులు ప్రజలకు చేరాలి. ప్రభుత్వం సరైన మార్కెంటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గితే తప్ప రియల్ రంగం పుంజుకోదు. ఇవన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆర్థికరరంగం గాడిన పడదు.

# పెట్రోల్, డీజిల్‌లను జిఎస్టీ పరిధిలోకి తేవాలి

**ఎక్సైజ్ సుంకాలు తగ్గించుకోవాల్సిందే**

**పన్నులపై ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి**




**న్యూఢిల్లీ, మార్చి 25 :** పన్నుల వ్యవస్థలో సహేతుకమైన మార్పులు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ జనాన్ని దోచుకోడం మానుకోకుంటే సమాజంలో అస్థిరతకు కారణం కాగలదు. పెట్రోల్, డీజెల్, వంటగ్యాస్‌పై పన్ను అక్కడికక్కడే చేతికి వచ్చి ఖజానాలను నింపుతాయి కాబట్టి వాటిని తగ్గించుకోడానికి పాలకులు వెనకాడుతున్నారు. అనుత్పాదక రంగాలకు అతిగా ఖర్చు పెట్టడం మానుకోవాలి. ఓట్లను రాబట్టే పథకాలను పక్కన పెట్టాలి. వస్తు, సేవల పన్ను నుంచి పెట్రోల్, డీజెల్‌ను మినహాయించడంలో ఆంతర్యం వాటి మీద తాము ఎప్పుడుబడితే అప్పుడు పన్నులను విధించి రాబడి పెంచుకోవాలన్న దురుద్దేశ్యం తప్ప మరోటి కానరాదు. ఇంధన ధరలను అదుపు చేయడంతో పాటు, సామాన్యులకు కూడా ధరలు అందుకునేలా ఉండాలి. పెట్రోట్, డీజెల్‌పై కేంద్రం వసూలు చేస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకోడం సరైన నిర్ణయంగా గుర్తించాలి. అదేపనిగా పన్నుల రూపంలో ప్రజలను దోచుకోవడం తగదని గుర్తించాలి. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రజలపై భారాలు మోపడం సరికాదని పాలకులు గమనించాలి. పెట్రోలులపై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం తగ్గించుకుంటేనే ఆ మేరకు వీటి ధరలు తగ్గి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం విధించే స్పెషల్ సుంకాలలో రాష్ట్రాలకు వాటా వుండదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తన ఆదాయానికి ఈ స్పెషల్ సుంకాల విధింపుపై ఆధారపడడం ఎక్కువైంది. ఇలాంటి సుంకాలతో భారం మోపే బదులు పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవడం మంచిది. కానీ తాజాగా ఎంపిల జీతభత్యాలను, పెన్షన్లు పెంచుకున్నారు. ఇంతక న్నా దారుణం మరోటి ఉండదు. పెట్రోల్ చిల్లర ధరలో 54 శాతం కేంద్ర, రాష్ట్రాలు విధించే పన్నుల కిందే పోతుంది. అలాగే డీజెల్ ధరలో 49 శాతం ఈ పన్నులే వుంటాయి. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌పై ప్రతి లీటర్ వద్ద రూ. 32.9 మేరకు ఎక్సైజ్ సుంకాన్ని వసూలు చేస్తున్నది. అలాగే డీజెల్ మీద రూ. 31.8 తీసుకుం టున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే అమ్మకపు పన్ను లేదా విలువ ఆధారిత పన్నులు ఇందుకు అదనంగా వుంటాయి. జిఎస్టీ పేరుతో ఇప్పటికే వాయింపులు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. నేలవిడిచి సాము చేసే పద్దతిని విడనాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు పెట్రోల్, డీజెల్‌పై తాము వసూలు చేసే పన్నులను గణనీయంగా తగ్గించుకోగలిగితే ప్రజలపై భారం తగ్గి వాటిని సునాయాసంగా కొనుగోలు చేయగలుగుతారు. దేశంలో వినియోగిస్తున్న చమురులో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నదే. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఓఎన్‌జిసి కష్టపడి శోధించిన చమురు, గ్యాస్ నిక్షేపాలను పూర్తి స్థాయిలో వెలికి తీయకుండానే ఈ రంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించారు. దానితో ప్రైవేటు కంపెనీలకు మేలు చేసిన వారు అవుతున్నారు. ఈ లెక్కన త్వరలోనే దేశంలో పెట్రోల్, డీజెల్ ధరలు కనీసంగా రూ.115 లకు చేరే ప్రమాదమున్నది. ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాలను పక్కన పెట్టి ప్రజలను పన్నుల భారం నుంచి తప్పించాలి. దుబారా తగ్గించుకోవడం చేయాలి.

# ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు

**ఏడాదయినా కార్యరూపం దాల్చని పథకం**



**హైదరాబాద్, మార్చి 25 :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏడాది కింద ప్రకటిం చారు. అయినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని కెసిఆర్, రేవంత్ ప్రకటిం చినా ఇద్దరూ మాటతప్పారు. గతేడాది జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను ఇస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహా రాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, ప్రజలు గర్వించేలా పనిచేస్తామ న్నారు. ఆధార్ నెంబర్ తరహాలో ఒక్కో పౌరుడికి స్మార్ట్ కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన చికిత్స అందించేందుకు వీలుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ప్రత్యేక నంబర్‌తో అనుసం ధానం చేయనున్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుపై ఉన్న నెంబర్ గానీ.. పేరు గానీ ఎంటర్ చేయగానే.. ఆ వ్యక్తికి సంబంధిం చిన వైద్య సేవల వివరాలు తెలుస్తాయనా అన్నారు. దీని వల్ల వారు ఏ వైద్యుడిని సంప్రదించినా.. వారివారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకునే వీలు ఉంటుందని.. మె-రుగైన వైద్యసేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడు తుందని చెప్పారు. కానీ ఏడాది గడిచింది. దీనిపై అడుగు ముందుకు పడలేదు. కనీసం చర్చ లేదు. ఎక్కడా కార్యాచరణ కానరావడం లేదు.




# దిగుమతులపై ఆధారపడితే ముప్పే

**న్యూఢిల్లీ, మార్చి 25 :** ప్రపంచ సరుకుల మార్కెట్లలో రష్యాది ప్రధాన పాత్ర కావడంతో అక్కడి కుదుపులన్నీ మనపై ప్రభావం చూపక మానవు. ప్రపంచంలో కెల్లా అతి పెద్ద సహజవాయు ఎగుమతిదారు రష్యా. రెండో అతి పెద్ద చమురు ఎగుమతిదారూ ఆ దేశమే. ఆ దేశ జీడీపీలో అయిదోవంతు వీటి పుణ్యమే. ప్రపంచ చమురు దిగుమతుల్లో 12 శాతం రష్యా నుంచే వస్తాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలైనప్పటి నుంచి ముడి చమురు ఫ్యూచర్లు 26 శాతం పైగా పెరిగాయి. గత డిసెంబర్‌లో బ్యారల్ 70 డాలర్లున్న అంతర్జాతీయ ముడి చమురు ధర ఇప్పుడు దాదాపు రెట్టింపు అయింది. చమురు అవసరాల్లో 85 శాతానికి దిగుమతులపైనే ఆధారపడ్డ దేశం మనది. ఇప్పుడిక ముడిచమురు దిగుమతి ఖర్చు భారీగా పెరుగు తుంది. చమురు కోసం రష్యాపై ఆధారపడ్డ పా శ్చాత్య దేశాలు తంటాలు పడుతు న్నాయి. చమురు ధరల కారణం గా పెరిగే ఆ ఖర్చు ప్రభావం సరకుల రవాణా మీద పడుతుంది. సరకుల రేట్లకు రెక్కలొస్తాయి. ఆహార ధరలు పెరుగుతాయి. గోధుమలు, మొక్కజొన్న, బార్లీ ప్రపంచ ఎగుమతుల్లోనూ రష్యా, ఉక్రెయిన్లది గణనీయమైన పాత్ర. వాటి రేట్లూ పెరుగుతున్నాయి. మన ఎరువుల దిగుమతుల్లో దాదాపు 17 శాతం పొటాష్, 60 శాతం ఎన్పీకే ఎరువులు రష్యావే. ఈ క్రమంలో దిగుమతులపై ఆధారపడ్డ మనం ధరల దాడిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

# దక్షిణాదిలో డీలిమిటేషన్ కాక

**హుటాహుటిని ఢిల్లీకి పళనిస్వామి**

**చెన్నై, మార్చి 25 :** దక్షిణాదిలో డీలిమిటేషన్ వ్యవహారం కాకరేపుతున్న తరుణంలో అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ సిఎం పళని స్వామి హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో కేంద్రంపై పోరాటానికి దిగారు. ఇప్పటికే పార్లమెంట్ ఉభయసభల్లో డీఎంకే సభ్యులు పోరాటం చేస్తున్నారు. ఇటీవల చెన్నై వేదికగా దక్షిణాది రాష్ట్రాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఒడిశా, పంజాబ్ నుంచి ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు హాజరై తమ గళాన్ని తెలియజేశారు. డీలిమిటేషన్‌తో ఏర్పడే విపత్తును గురించి ప్రస్తావించారు. తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు-చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఇదిలా ఉంటే డీలిమిటేషన్‌పై ఉద్యమం ఉధృతం అవుతున్న వేళ బీజేపీ అధిష్టానం అప్రమత్తం అయింది. తమిళనాడు అన్నాడీఎంకే ప్రధాని కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి పళినిస్వామికి కబురు పంపింది. దీంతో ఆయన అత్యవసరంగా దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరారు. ఢిల్లీలో బీజేపీ అగ్ర నేతలను కలిసే అవకాశం ఉంది. సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసే ఛాన్సుందని తెలుస్తోంది. అంతేకాకుండా వచ్చే ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మరోసారి బీజేపీ-ఏఐడీఎంకే పొత్తు ఉండే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక పర్యటనలో భాగంగా ఢిల్లీలో ఏఐడీఎంకే పార్టీ ఆఫీసును ఈపీఎస్ ప్రారంభించనున్నారు.



# జాతీయ జలవిధానంపై స్పష్టత రావాలి

**నదుల అనుసంధానం ఎజెండా కావాలి**



**న్యూఢిల్లీ, మార్చి 25 :** వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతకు సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయరాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని ముమ్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టుల వారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ చెప్పినట్లుగా నదీజలాల లభ్యత ను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఎపిలో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాకు తరలించే బృహత్తర పథకం సాగింది. దీంతో ఆ రాష్ట్రంలో కృష్ణాడెల్టాలో సమస్య రాకుండా చూసుకున్నారు. ఇదో ఉదాహరణ మాత్రమే. అలాగే కాళేశ్వరం పూర్తయితే తెలంగాణ కూడా సస్యశ్యామలం కాగలదు. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కటు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట వెలువడిన ఈ తీర్పు మరింత ఎక్కువ స్థాయిలో రెండు రాష్ట్రాలనూ నష్టపరిచే రీతిలో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కు లెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఆ న్యాయన్ని పాటించ కుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. వర్షపాతం తగ్గి, నదీజలాల లభ్యతలో కొరత ఉండడం సాధారణంగా మారిన ప్పుడు అందుకు తగ్గట్టుగా న్యాయంగా, స్పష్టంగా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని ట్రిబ్యునల్ గమనంలోకి తీసుకున్నట్టు లేదు. బ్రిజేష్ ట్రిబ్యునల్ లో కౌంటర్ దాఖలు చేయడం ద్వారా కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసింది. ఉమ్మడి ఏపీ విభజనతో నదీ పరీవాహక రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఏపిలకు సమాన హక్కులు ఉండాలి. నీటి పంపిణీ పంచాయతీ నుంచి మహారాష్ట్ర, కర్నాటకలను ట్రిబ్యునల్ మినహాయించడం సహజ న్యాయ సూత్రాలకు, అంతర్జాతీయ నీటి చట్టాలకు పూర్తి విరుద్ధం. బ్రిజేష్ ట్రిబ్యునల్ అవలంబిస్తున్న ధోరణి, అది చేపట్టిన విచారణ మొదటి నుంచీ ఎగువ రాష్ట్రలకు అనుకూలంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా సాగింది. మిగులు జలాలపై దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి బచావత్ అవార్డు పూర్తి హక్కులు కల్పించగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చి తన అశాస్త్రీయ విధానంతో ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఈ అన్యాయంపై ఇంకా పేచీలు కొనసాగుతున్నాయి. నీటి లభ్యత లేని సమయంలో ఎగువ రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని వాడుకుంటే కిందికి చుక్కరాదు. దిగువ రాష్ట్రం అనివార్యంగా నష్టపోవాల్సిందే. కొత్తగా తెలంగాణ ఏర్పడ్డ కారణంగా ఇప్పుడు నీటిని అన్ని రాష్ట్రాలు సమానంగా పంచుకునేలా తీర్పు ఉండాలి. అప్పుడే న్యాయం జరగగలదు. తెలంగాణ, ఆంధ్ర సమస్యగా ఉద్వేగాలతో ముడిపెట్టకుండా రెండు తెలుగు రాష్ట్రాలు సమన్వయంతో పని చేయాలి.



## ఖాళీగా ఉన్నచోట వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి

- ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** ఉమ్మడి గ్రామాలు ఉండి నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రోజున మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గ్రామపంచాయతీలు గతంలో ఉన్న గ్రామాలు నూతనంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించడం లేదని వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేసారు పని ప్రదేశంలో నీడకు టెంట్, మంచినీటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. సమావేశంలో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి కొమ్ము స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొడిగె యాదయ్య, కూలీలు రాపోలు సునీత గోద నాగమణి శ్యామల సాలమ్మ దాసరి చంద్రకళ కోనపురి కలమ్మ రాపోలు పోశయ్య సప్పిడి నాగమ్మ నారి పద్మ రాపోలు మల్లయ్య రాపోలు శంకరమ్మ పాల్గొన్నారు.




## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**సహాయం అందించిన కాంగ్రెస్ నాయకులు నక్కల మాధవరెడ్డి**

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని పులిగిల్ల గ్రామం మదిరే గోలిగూడెం కి చెందిన పినింటి మల్లారెడ్డి సోమవారం రోజున అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది నిరుపేద కుటుంబమైన వారికి జిల్లా కాంగ్రెస్ నాయకులు నక్కల మాధవ రెడ్డి 10000 రూపాయలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుగ్గ మనోజ్ కుమార్ 5000 రూపాయలు వారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోలిగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కంచి రాములు, కొంతం వెంకట్ రెడ్డి, పైళ్ల నర్సిరెడ్డి, పులిగిల్ల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్సం భాస్కర్ ఉపాధ్యక్షులు వాకిటి సంజీవరెడ్డి, జక్కడి చంద్రారెడ్డి, కొమ్మిడి వెంకట్ రెడ్డి బుగ్గ పరంధామ, పర్వతం రాజు, బుగ్గ శ్రీనివాస్, పల్లెర్ల స్వామి, మెరుగు కృష్ణ, బుగ్గ నాగరాజు, కళ్లెం జంగారెడ్డి, బుగ్గ మల్లేశం, కంబాలపల్లి శ్రీశైలం, ఎస్.కె లతీఫ్, వరకాంతం కృష్ణారెడ్డి, పర్వతం బాల నరసయ్య, బండారి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి

**బిఆర్ఎస్ జిల్లా నాయకులు యశిల్ గౌడ్ డిమాండ్**



**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు జడల యశిల్ గౌడ్ మంగళవారం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తవుతున్నా ఇంకా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం తో గ్రామాల లో సమస్యలు పెరిగాయని అన్నారు.. రాష్ట్రంలో రేషన్ కార్డులు ఇస్తామని, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, మహిళలకు 2500 ఇస్తామని, తులం బంగారం ఇస్తామని అమలు చేయలేదన్నారు.. రానున్న రోజుల్లో తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.




## రాజీవ్ యువ వికాసం అవగాహన సదస్సు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, స్టాండింగ్ కమిటీ సభ్యుడు వి. జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగవారం రోజు నల్లగండ్ల లోని తన నివాస కాంగ్రెస్ పార్టీ ఆఫీసు లో రాజీవ్ యువ వికాసం కార్యక్రమం గురించి పార్టీ శ్రేణులకు అవగాహన సదస్సును నిర్వహించారు. దీనికి సీనియర్ నాయకులు,కంటెస్టెడ్ కార్పొరేటర్స్, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళ నాయకురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ నాయకులందరు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యమంలో వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నాయకులని ఉద్దేశించి యువతకు స్వయం ఉపాధిని పెంచడానికి తెలంగాణ ముఖ్యమంత్రి 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమం ప్రారంభించారని, దీనిపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని నాయకులని సూచించారు. అలాగే నాయకులు అందరూ దీనిపై ప్రత్యేక దృష్టి సాధించి అర్హులు అందరినీ అప్లై చేసుకోవాల్సింది తెలియని వాళ్ళందరికీ తెలియచెప్పల్సింది గా కోరారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ నుండి సీనియర్ నాయకులు మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ దోర్నాల రవికుమార్ గౌడ్, యూత్ కాంగ్రెస్ శేరిలింగంపల్లి జనరల్ సెక్రటరీ కడుకుంట్ల రాంబాబు, మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ రాయి కోటి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు కె. నవీన్ కుమార్, చింతల సురేష్ యాదవ్ లు పాల్గొని విజయంతం చేశారు, కార్యక్రమాన్ని ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ నాయకులు కడుకుంట్ల రాంబాబు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం అప్లికేషన్ కొరకు కులం, ఆదాయం సర్టిఫికెట్ రేషన్ కార్డు, పాన్ కార్డు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తప్పనిసరి అని, ఆదాయం సర్టిఫికెట్ కొత్త ఆర్థిక సంవత్సరాది అయ్యి ఉండాలి అని సూచించారు.

## నష్టపోయిన పంటలను పరిశీలించిన నవాబుపేట్ బిఆర్ఎస్ నాయకులు

- పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి
- వర్షానికి పంట నష్టం జరిగిన అధికారికాలు నాయకులు కానీ సందర్శించకపోవడం విడ్డూరం
- బిఆర్ఎస్ పార్టీ నవాబుపేట్ మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఇటీవల కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంట పొలాలను వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని రైతుల పంట పొలాలను నవాబుపేట్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు అంతమొల్ల దయాకర్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల పంట పొలాలలో నష్టపోయిన రైతులను ఉద్దేశించి బిఆర్ఎస్ పార్టీ నవాబుపేట్ మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని రైతులు ఇటీవల కురిసిన అకాల వర్షానికి చాలా పంటలు నష్టపోవడం జరిగిందన్నారు. ఈ విషయమై అగ్రికల్చర్, ఆర్టికల్చర్ అధికారులకు పంట నష్ట పరిస్థితుల గురించి తెలుసుకొని రైతులకు తగిన న్యాయం చేకూర్చాలని తెలపడం జరిగిందని తెలిపారు. నవాబుపెట్ మండల పరిధిలో ఎన్ని గ్రామాలలో పంట నష్టం జరిగిందో ప్రతి ఒక్క రైతుని సందర్శించి నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టం చేకూర్చే విధంగా పంట పొలాలను పరిశీలించాలని పేర్కొన్నారు. నష్టపోయిన పంట పొలాల అంచనా విలువ ప్రభుత్వానికి తెలిపి తగిన నష్టపరిహారం ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఇవ్వాలని, లేనిపక్షంలో అకాల వర్షానికి పంట నష్టం వాటిల్లిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చేంతవరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఈ అకాల వర్షంతో కూరగాయలు, మొక్కజొన్న, జొన్న, ఉల్లిగడ్డ, టమాట మొదలగు పంటలలో రైతులకు నష్టం జరిగిందని అన్నారు. ప్రభుత్వము వెంటనే స్పందించి అధికారులతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి పంట నష్టం కలిగిన రైతులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేటికి రైతులు ఇంకా అనేక గోసను ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం భరోసా ఇస్తామంటూ రైతులను మరింత గోసపెట్టడం ఎంత మాత్రం సరి అయింది కాదన్నారు. అకాల వర్షం లో పంట నష్టం కలిగిన రైతులను పరామర్శించడానికి స్థానిక అధికారులు కానీ, నవాబుపేట్ నాయకులు కూడా ఇప్పటివరకు స్పందించకపోవడం, రైతులను ఓదార్చకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. పంట నేలపాలై రైతులు ఆగమ గోచర స్థితిలో ఉండగా ఒక నాయకుడు కూడా స్పందించకపోవడం రైతులను అధైర్యపరచడం ఎంతవరకు సరైందని అన్నారు. రైతులు ఎలక్షన్ సమయంలో ఓట్లు అడగడానికే గుర్తుకొస్తారా...? కష్టాలలో ఉన్నప్పుడు గుర్తుకు రారా అని ఆరోపించారు. ఈ అకాల వర్షానికి పంట నష్టం ఏర్పడిన రైతుల పక్షాన బి ఆర్ ఎస్ ప్రభుత్వం రైతులకు పంట నష్టం వచ్చేంతవరకు రైతుల పక్షాన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శాంత్ కుమార్, పురుషోత్తం చారి, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు జగన్ రెడ్డి, అధికార ప్రతినిధి సుధాకర్, నాయకులు ముకుంద రెడ్డి, లింగం, నాగేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## హామీలపై నిలదీస్తే అరెస్ట్ చేస్తారా?

**రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి**

- మహిళలకు ఇచ్చిన హామీల అమలు కోసం బిజెపి నిరసన.
- మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి.
- ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడం కూడా నేరమా..?
- మహిళా మోర్చా కార్యకర్తల అరెస్టును ఖండిస్తున్నాం.




**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎదుట నిరసన వ్యక్తం చేసిన మహిళా మోర్చా కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తే అరెస్టు చేయడమేనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నైతికత అని ధ్వజమెత్తారు. మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 ఆర్థిక సహాయం ఇస్తామన్నారు.. ఏమైంది..? 18 ఏళ్లు నిండిన అమ్మాయిలకు ఉచితంగా స్కూటీలు ఇస్తామన్నారు.. ఇంతవరకు ఏ ఒక్కరికీ ఇవ్వలేదు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 20 లక్షలకు పెంచుతామన్నారు.. ఎందుకు అమలు చేయడంలేదు..? పెన్షన్ మొత్తాన్ని రూ.4,000కి పెంచుతామన్నారు.. కాంగ్రెస్ సర్కారు మాట మీద నిలబడటం లేదెందుకు..? అభయ హస్తం నిధులు ఇంకెప్పుడు విడుదల చేస్తారు..? కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాలోకానికి సమాధానం చెప్పాలి. ఎన్నికల ముందు హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని, అధికారంలోకి రాగానే వెనుకడుగు వేసిన కాంగ్రెస్ పార్టీ, పదే పదే మోసం చేస్తోంది. తెలంగాణలో మహిళలపై వేధింపులు, హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళల సమస్యలు పట్టవు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేలుకొని రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించాలి. తుకారాం గేట్, అఫ్జల్ గంజ్, ఫలక్ నుమా, నారాయణగూడ, సీతాఫల్ మండి పోలీస్ స్టేషన్లకు తరలించిన సుమారు 150 మంది మహిళా మోర్చా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలి. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. లేదంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పోరాటం మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కంజుల సుగుణ రెడ్డి, పలువురు రాష్ట్ర మహిళా నేతలు, జిల్లా మహిళా నేతలు, బిజెపి మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘోర ప్రమాదం.. పాస్టర్ మృతి

- భీమదేవరపల్లి మండలంలో కారును ఢీ కొట్టిన లారీ
- లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం
- శోకసంద్రంలో పాస్టర్ కుటుంబం





**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని చాయ్ విహార్ సమీపంలో సిద్దిపేట- హనుమకొండ రహదారిలో లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామగుండం పట్టణానికి చెందిన కనకపూడి కర్ణాకర్(58) సోమవారం (తెల్లవారితే మంగళవారం) మధ్య రాత్రి ఎల్కతుర్తి వైపు నుండి హుస్నాబాద్‌కు కారులో వెళ్తున్నారు. ఎదురుగా ములకనూరు వైపు నుండి వస్తున్న లారీ, కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కరుణాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు, పోలీసులకు,108 కి సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కరుణాకర్ కుమారుడు సిద్ధార్థ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాదా లావణ్య శంకర్ గౌడ్ అల్లుడు మల్కాజ్గిరి గౌతమ్ నగర్ డివిజన్ ఇందిరా నెహ్రూ నగర్ లో బొల్లెపల్లి వెంకటేష్ గౌడ్,నాగమణి దంపతుల కుమారుడు చత్రపతి శివాజీ గౌడ్, రజని వివాహం సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఇంచార్జ్ మైనంపల్లి హనుమంతరావు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోహన్ రాజ్ తుమట్ల వెంకటేష్ యాదవ్, ప్రవీణ్ రామ్ చందర్, నాగరాజ్, మణిదాస్, శంకర్ డి కె శ్రీనివాస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## పారిశ్రామిక పార్కుకు భూములను ఇచ్చిన రైతులకు నష్టపరిహారం

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పారిశ్రామిక పార్క్ కు భూములను ఇచ్చేందుకు సమ్మతి తెలిపిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళ వారము వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలు నందు జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన దుద్యాల మండలం హకీంపెటకు సంబంధించి 114 మంది రైతులతో సంప్రదిం పులు కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ హకీంపెట్ గ్రామం లో మొత్తం పట్టా భూమి 146.34 గుంటల భూమి ఉందని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతులతో అగ్రిమెంటు తీసుకొని ముందుకు వేళతామన్నారు. జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ నిర్ణయం ప్రకారము అవార్డు, చెక్ డిస్ట్రిబ్యూషన్ ఉంటుందన్నారు. సమ్మతి అవార్డు పొందిన రైతులకు ఒకే విడతలో చెక్కుల ద్వారా నష్ట పరిహారాన్ని చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎకరానికి 20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలములో ఇందిరమ్మ ఇల్లు, అర్హత మేరకు ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆర్ అండ్ బి ఇ ఇ శ్రీధర్ రెడ్డి, టిజిఐఐసి జోనల్ మేనేజర్ ఓ.వి.టీ. శారద, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమ సుల్తానా, దుద్యాల మండలం తహసిల్దార్ కిషన్, హకీంపేట రైతులు తదితరులు పాల్గొన్నారు.



## భగత్ సింగ్ ఆశయాలలో ప్రయాణించాలి

- అడవి హక్కుల చట్ట ప్రకారం పేదలకు భూములు ఇవ్వాలి
- నాణ్యత లేకుండా నిర్మించిన వాటర్ ట్యాంక్
- వాటర్ ట్యాంక్ కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- వికారాబాద్ జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** భగత్ సింగ్ ఆశయాలు, ఆయన బాటలో ప్రయాణించాలని సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ అన్నారు. సిపిఎం పార్టీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొట్టం గుట్ట తండా, జాంబపురం, గెర్గెంటిపల్లి గ్రామాలలో మంగళవారం ఆ గ్రామాలలో ఉన్న పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ మైపాల్ మాట్లాడుతూ భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించరు. తండాలోని గ్రామాలలో వార్డులలో సిసి రోడ్లు లేవని, అనేకమందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు 200 ఇండ్లు మంజూరు చేయాలని తెలిపారు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఫారెస్ట్ భూమి సర్వే నంబర్ 37, 38, 104,105లలో సాగు చేసుకుంటున్న గిరిజనులకు పేద రైతులకు అడవి హక్కుల చట్ట ప్రకారం 60 ఎకరాల భూమిని 80 కుటుంబాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెయిన్ రోడ్ నుండి జాంబపురం తాండవరకు వీధిలైట్లు, సిసి రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటం ద్వారా ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉందని, ఇక్కడ సిసి రోడ్లు వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండటం ద్వారా ప్రభుత్వం వెంటనే స్పందించి డ్రైనేజీ బాగు చేయాలని అన్నారు. ట్రాన్స్ఫార్మర్ చుట్టూ రక్షణ కవచముగా ముళ్లకంచను ఏర్పాటు చేయాలన్నారు. మినరల్ వాటర్ ట్యాంకులు నాణ్యత లేకుండా నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నాణ్యతతో నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాల్ రాజ్, కే అనంతయ్య, నరేందర్, రాజేష్, గణేష్, చిన్న రాజు, శ్రీను, తులసి రామ్, గోపాల్, రవి, బాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక

## జడ్జి ఇంట్లో నోట్ల కట్టల వివాదం..

### అఖిలపక్ష భేటీకి ధన్‌ఖడ్ పిలుపు




**న్యూఢిల్లీ :** దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడిన ఘటన పెను సంచలనం సృష్టిస్తోంది. దీనిపై విచారణ కమిటీ నేతృత్వంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ అంశంపై చర్చించేందుకు తాజాగా ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఈ సాయంత్రం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. “ఇది చాలా క్లిష్టమైన, తీవ్రమైన అంశం. దీనిపై రాజ్యసభాపక్ష నేత, ప్రతిపక్ష నేతతో చర్చించా. దీనిపై అఖిలపక్ష సమావేశం పెడితే బాగుంటుందని వారు సూచించారు. వారి అభిప్రాయాన్ని అంగీకరించి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సమావేశం ఏర్పాటుచేస్తున్నా. రాజ్యసభలో అన్ని పార్టీల పక్ష నేతలు దీనికి హాజరుకావాలని కోరుతున్నా” అని సభా సమావేశాల సందర్భంగా దన్‌ఖడ్ వెల్లడించారు. ఈ భేటీ ఫలప్రదం కావాలని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం సందర్భంగా ఈ నోట్ల కట్టలు బయటపడిన సంగతి తెలిసిందే. దీనిపై ఇప్పటికే సుప్రీంకోర్టు సీజేఐ.. ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని ఏర్పాటుచేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయమూర్తిని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. అయితే, ఈ ఆరోపణలను జస్టిస్ వర్మ ఖండించారు. తాను గానీ, తన బంధువులు గానీ ఎటువంటి నోట్ల కట్టలను గదిలో ఉంచలేదని తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జరిగిన కుట్రగా దీనిని పేర్కొన్నారు.



## జమిలి ఎన్నికలు.. జేపీసీ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ :** జమిలి ఎన్నికల కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ కాల పరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. భాజపా ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల చివరివారంలో తొలి రోజు వరకు గడువు పొడిగించింది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటైంది. దీనిలో లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. అయితే.. ఈ కమిటీ కాలపరిమితి వచ్చేనెల 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలివుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిగాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రఖ్యాత న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.షాలు కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు. జేపీసీ గడవు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ తాజాగా ఆమోదం తెలిపింది.



## 2 నిమిషాల ఫేమ్ కోసం..

### కునాల్ కామ్రా వ్యాఖ్యలపై స్పందించిన కంగనా

**ముంబాయి :** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందేను ఉద్దేశించి స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తాజాగా దీనిపై భాజపా ఎంపీ, బాలివుడ్ నటి కంగనా రనౌత్ స్పందించారు. కేవలం 2 నిమిషాల ఫేమ్ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే సమాజం ఎక్కడికి వెళ్తుందో మనం ఆలోచించాలన్నారు. ఓ వార్తా సంస్థతో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ‘కేవలం 2 నిమిషాల ఫేమ్ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే సమాజం ఎక్కడికి వెళ్తుందో మనం ఆలోచించాలి. మాట్లాడింది ఎవరైనా కావచ్చు. కానీ, ఒకరిని అవమానించడం, వారి పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదు. విమర్శించాలనుకుంటే సాహిత్య ప్రక్రియ ద్వారా ఆ పని చేయవచ్చు. కానీ, కామెడీ అనే పేరుతో మన సంస్కృతిని, ప్రజలను దూషిస్తున్నారు. ఈ వివాదానికి సంబంధించి ఆ వేదికను కూల్చడం చట్టబద్ధంగానే జరిగింది. కానీ, నా విషయంలో మాత్రం చట్టవిరుద్ధంగానే జరిగింది’ అని కంగనా పేర్కొన్నారు. గతంలో నటుడు సుశాంత్‌సింగ్ కేసు దర్యాప్తు గురించి కంగనా మాట్లాడుతూ.. మూవీ మాఫియా కంటే ముంబయి పోలీసులంటేనే భయంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇవి కాస్తా రాజకీయ దుమారం రేపాయి. దీనిపై ప్రస్తుత శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌కు, కంగనాకు మధ్య కొన్నిరోజుల పాటు మాటల యుద్ధం జరిగింది. ఈ నేపథ్యంలోనే ముంబయి మహానగర పాలక సంస్థ (బీఎంసీ) బాంద్రాలోని నటి కార్యాలయంలోని కొంత భాగాన్ని కూల్చివేసింది. దీనిపై కంగనా ముంబయి కోర్టును ఆశ్రయించారు. బీఎంసీపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నటికి జరిగిన నష్టాన్ని పూడ్చాలని తీర్పునిచ్చింది. తాజాగా ఇదే విషయాన్ని ఆమె ప్రస్తావించారు. ఇటీవల హబిటాట్ స్టూడియోలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏక్‌నాథ్ శిందేపై కునాల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఆయన్ను ద్రోహితో పోల్చడంతో పాటు.. ‘దిల్ తో పాగల్ హై’ అనే హిందీ పాటలోని చరణాలను రాజకీయాలకు అనుగుణంగా మార్చి అవమానకర రీతిలో పాడారు. దీంతో శివసేన శిందే వర్గం కార్యకర్తలు ఆ స్టూడియోపై దాడి చేసి ధ్వంసం చేశారు. దీంతో 12 మందిని అరెస్టు చేశారు. మరోవైపు పోలీసులు సోమవారం కునాల్‌పై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈక్రమంలోనే బీఎంసీ ఉద్యోగులు భారీ పరికరాలతో అక్కడికి చేరుకొని స్టూడియోలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

# ట్రంప్ ‘సోషల్’ ప్రతిపాదన

### గ్రీన్‌కార్డుదారుల్లో గుబులు..!




**వాషింగ్టన్ :** అమెరికాలో అక్రమ వలసదారుల ఏరివేత లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా సోషల్ మీడియా ఖాతాలపై దృష్టిపెట్టిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ పరిధిని మరింత విస్తరించాలని ప్రతిపాదించింది. దానికింద అమెరికాలో నివసిస్తోన్న గ్రీన్‌కార్డ్‌దారులంతా తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అప్పగించాల్సి రావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే వీసా దరఖాస్తుదారులు యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌కు తమ ఖాతాల వివరాలను వెల్లడించాల్సి ఉంది. కొత్త ప్రతిపాదన అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తోన్న, శాశ్వత నివాసం, ఆశ్రయం కోరుతున్న వారికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ మెరుగైన గుర్తింపు ధ్రువీకరణను సాధ్యం చేస్తుందని, దేశ భద్రతకు సంబంధించిన ముప్పును నివారించేందుకు దోహదం చేస్తుందని అమెరికా ప్రభుత్వం గత నోటీసుల్లో పేర్కొంది. గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు అంటూ అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు లక్షల మంది వలసదారుల్లో, ముఖ్యంగా భారత సంతతి వారిలో గుబులు రేపుతోంది. దీనికి అనుగుణంగానే గత కొన్ని వారాలుగా అమెరికా తమ వలస చట్టాలను కఠినతరం చేయడం వలసదారుల్లో ఆందోళనను పెంచుతోంది. ఇక తాజా ప్రతిపాదన కింద.. అమెరికా విధానాలు విమర్శించేవారు ఆ దేశాన్ని తమ నివాసంగా మార్చుకోకుండా నిరోధించే వీలు కలుగుతుంది. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ, యూఎస్-భారత్ సంబంధాల్లో చురుకైన పాత్ర పోషిస్తోన్న పలువురు భారత సంతతి వ్యక్తులపై ఈ ప్రతిపాదనలు ప్రభావం చూపేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాజకీయ అంశాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేసే పరిస్థితి లేకుండా పోతుందనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేశారు. హెచ్-1బీ, ఎఫ్-1, గ్రీన్‌కార్డు కలిగిన భారతీయులు ప్రయాణాల్లో అప్రమత్తత పాటించాలని సూచించారు. వీరు అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు మరింత ఎక్కువగా ఉంటాయని, సహనంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలకు చెందిన పౌరులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధించాలని ట్రంప్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ ఈ ఆంక్షల జాబితాలో లేనప్పటికీ.. అమెరికా వెలుపల ప్రయాణాలు చేయాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జనవరి 20న ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగానే.. అమెరికా ప్రజల రక్షణకు సంబంధించిన పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. “గత నాలుగేళ్లలో అమెరికాలో అక్రమ వలసదారులు పోటెత్తారు. లక్షల మంది సరైన పత్రాలు లేకుండానే మన సరిహద్దులు దాటి దేశంలోకి వచ్చారు. ఆ తర్వాత ఇక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రత, ప్రజల రక్షణకు ముప్పుగా మారుతున్నారు. అందుకే అక్రమ వలసదారుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం” అని ట్రంప్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అమెరికా అధ్యక్షుడికి పుతిన్ కానుక



**మాస్కో :** రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌నకు ఓ కానుకను బహూకరించారట. ఈ విషయాన్ని క్రెమ్లిన్ స్వయంగా ధ్రువీకరించింది. ఇటీవల ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ మాస్కోలో పర్యటించారు. ఆ సమయంలో విట్‌కాఫ్‌కు ట్రంప్ చిత్ర పటాన్ని ఇచ్చి దాన్ని ట్రంప్‌నకు అందించాలని కోరినట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వివరించారు. విట్‌కాఫ్ గతవారం ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయాన్ని పేర్కొంటూ ఆ బహుమతిని అందమైనదిగా అభివర్ణించారు. 2018లో ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చాక పుతిన్ ఒక సాకర్ బంతిని ట్రంప్‌నకు బహూకరించారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. పెన్సిల్వేనియాలో ప్రచారంలో ఉండగా 20 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో.. ట్రంప్ చెవికి స్వల్పంగా గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి.. వేదికపైనుంచి దించి ఆస్పత్రికి తరలించారు. ఆ ఘటన అప్పట్లో సంచలనమైంది. ఆ విషయం తెలుసుకున్న పుతిన్.. ట్రంప్ క్షేమం కోసం అప్పుడు ప్రార్థనలు చేశారని ఇటీవల విట్‌కాఫ్ పేర్కొన్నారు. స్థానిక చర్చకు వెళ్లి, మత గురువును కలిసి, అధ్యక్షుడి కోసం ప్రార్థించారని తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. అందులోభాగంగా 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించారు. దీనికి ఉక్రెయిన్ అంగీకరించగా.. మాస్కో సూత్రప్రాయంగా ఓకే చెప్పింది. ఈక్రమంలో ఇరుదేశాల అధ్యక్షులతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజుల పాటు దాడులు నిలిపివేయాలని పుతిన్‌కు సూచించగా ఆయన అంగీకరించారు. అయితే, ఒప్పందం జరిగిన కొన్ని గంటలకే అది ఉల్లంఘనకు గురైంది. ఇదిలాఉండగా.. సౌదీ అరేబియాలోని జెడ్డాలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ చర్చల్లో పురోగతి సాధించడం కష్టమని దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యానించారు. నల్లసముద్రంలో వాణిజ్యనౌకల భద్రతే తమకు కీలకమన్నారు.

## మా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం

### మళ్లీ నోరుపారేసుకున్న కెనడా



**కెనడా :** భారత్-కెనడాల మధ్య దౌత్య వివాదం కొనసాగుతున్న వేళ ఒట్టావా మరోసారి న్యూదిల్లీపై నోరు పారేసుకుంది. కెనడాలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భారత్, చైనా జోసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. రష్యా, పాకిస్థాన్ కూడా ఆ ప్రయత్నం చేయొచ్చని అనుమానాలు వ్యక్తం చేసింది. కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. “త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు శత్రు దేశ నాయకులు కృత్రిమ మేధ సాధనాలను ఎక్కువగా ఉపయోగించుకుంటున్నట్లు మాకు సమాచారం ఉంది. చైనా ప్రభుత్వం ఈ ప్రయత్నాలు చేసేందుకు అధిక అవకాశాలు ఉన్నాయి. భారత ప్రభుత్వానికి కూడా ఆ సామర్థ్యం, ఉద్దేశం ఉంది” అని లాయిడ్ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై ఒట్టావాలోని చైనీస్, భారత దౌత్య కార్యాలయాలు ఇంకా స్పందించలేదు. కాగా.. గతంలో కెనడా ఇలాంటి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. కెనడా ఎన్నికల్లో విదేశీ ప్రభుత్వాల జోక్యం అంటూ వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు నిమిత్తం ఆ దేశ ప్రభుత్వం ఓ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో న్యూదిల్లీపై తీవ్ర ఆరోపణలు చేసింది. “ఫెడరల్ ఎన్నికల్లో పోటీ చేసిన మూడు రాజకీయ పార్టీల నాయకులకు భారత ప్రభుత్వం ప్రాక్సీ ఏజెంట్ల ద్వారా రహస్యంగా ఆర్థికసాయం అందించినట్లు తెలుస్తోంది” అని కెనడియన్ కమిషన్ పేర్కొంది. దీన్ని భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. వాస్తవానికి భారత అంతర్గత వ్యవహారాల్లో కెనడానే జోక్యం చేసుకుంటోందని, దీనివల్ల మన దేశంలో అక్రమ వలసలు, వ్యవస్థీకృత నేర కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడింది. 2023 జూన్‌లో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ కెనడాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. వాటిని న్యూదిల్లీ తీవ్రంగా ఖండించింది. దీనిపై ఇరుదేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతుండగానే.. కెనడా పదేపదే న్యూదిల్లీపై ఆరోపణలు చేస్తూనే ఉంది. ఇదిలాఉండగా.. కెనడా నూతన ప్రధానిగా ఇటీవల ప్రమాణ-స్వీకారం చేసిన మార్క్ కార్నీ ముందస్తు ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఏప్రిల్ 28న అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

## హుస్నాబాద్‌లో ఎస్‌యు ఇంజనీరింగ్ కాలేజి మంజూరు

### పొన్నంకి ధన్యవాదములు తెలిపిన భీమదేవరపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కుల అనిల్



**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు పట్ల భీమదేవరపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కుల అనిల్ హర్షం వ్యక్తం చేశారు. బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి వల్లే హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజ్, లా కాలేజ్ మంజూరైనట్లు వారు తెలిపారు. హుస్నాబాద్ పరిసర ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడు తుందని సంతోషం వ్యక్తం చేశారు. రాను న్న రోజుల్లో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకురావడమే మంత్రి పొన్నం ప్రభాకర్ ఏకైక లక్ష్యం అని అన్నారు. పెద్దపల్లి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి మేరకు శాతవాహన యూనివర్సిటీకి హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజి, లా కాలేజి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అన్నారు.




## కశ్మీర్‌లో ఆ భూభాగాన్ని పాక్ ఖాళీ చేయాల్సిందే..

### దాయాదికి భారత్ వార్నింగ్

**యునైటెడ్ నేషన్స్ :** అంతర్జాతీయ వేదికపై భారత్‌ను నిందించాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. జమ్మూకశ్మీర్‌పై అనవసర ప్రస్తావన తీసుకొచ్చిన దాయాదికి న్యూదిల్లీ గట్టిగా చురకలంటించింది. ఆ ప్రాంతం ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టంచేసింది. పాక్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన కశ్మీర్ భూభాగాలను ఖాళీ చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. ఐక్యరాజ్యసమితిలో శాంతి పరిరక్షణ సంస్కరణలపై చర్చ సందర్భంగా పాక్ ప్రతినిధి సయ్యద్ తారిఖ్ ఫతేమీ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ ఆరోపణలపై ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ దేశం అనవసర అంశాలను లాగుతోందని మండిపడ్డారు. “భారత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌పై పాకిస్థాన్ ప్రతినిధి మరోసారి అనవసర వ్యాఖ్యలు చేశారు. ఇలా పదేపదే ఈ అంశాన్ని లేవనెత్తడం వల్ల వారు చేసే చట్టవిరుద్ధ వాదనలు నిజమైపోవు. ఇలాంటి ప్రయత్నాలతో వారు ప్రోత్సహిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరు. జమ్మూకశ్మీర్ ఇప్పటికీ, ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. ఈ ప్రాంతంలోని కొంత భూభాగం ఇప్పటికీ పాక్ ఆక్రమణలోనే ఉంది. దాన్ని ఖాళీ చేయాల్సిందే. సంకుచిత, విభజన ఎజెండాతో ఈ వేదిక దృష్టిని మళ్లించే కుతంత్రాలు చేయడం మానుకుంటే మంచిది” అని పర్వతనేని హరీశ్ దాయాదికి హితవు పలికారు. గతవారం ఐరాస మానవ హక్కుల సంఘం సమావేశంలోనూ పాక్ జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించింది. దీనికి భారత్ కూడా దీటుగా బదులిచ్చింది. పాక్ పదే పదే అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టింది.



## యెమెన్ యుద్ధ ప్రణాళికలు ముందే లీక్..

అమెరికా బలగాలు ఇటీవల యెమెన్‌పై భీకర దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ దాడికి ముందే దీనికి సంబంధించిన ప్రణాళిక బహిర్గతం అయినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర ముఖ్య అధికారులు దీనిపై చర్చిస్తున్న గ్రూప్‌చాట్‌లో ఒక జర్నలిస్టు ఉన్నారట. దీంతో దాడులకు సంబంధించిన విషయాలు ఆ జర్నలిస్టుకు సైతం ముందే తెలుసని వైట్‌హౌస్ ధ్రువీకరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మార్చి 15న యెమెన్‌పై దాడులను ప్రకటించారు. అయితే, అంతకంటే ముందే సిగ్నల్‌లోని గ్రూప్‌చాట్ ద్వారా తనకు నోటీసు అందిందని ‘ద అట్లాంటిక్ మ్యాగజైన్’ ఎడిటర్ ఇన్ చీఫ్ జెఫ్రీ గోల్డ్‌బర్గ్ పేర్కొన్నారు. తనను రెండు రోజుల ముందే గ్రూప్‌లో ఆడ్ చేశారని తెలిపారు. హెగ్సెత్ గ్రూప్ చాట్‌లో టార్గెట్స్, అమెరికా ఆయుధాల మోహరింపు, దాడులు చేసే దిశ వంటి అంశాలపై చర్చించినట్లు గోల్డ్‌బర్గ్ పేర్కొన్నారు. ఆవిధంగానే దాడులు సైతం జరిగాయని ఆయన వెల్లడించారు. వాన్స్‌గా గుర్తించిన వ్యక్తి ఈ దాడులను వ్యతిరేకించినట్లు తెలిపారు. షిప్పింగ్స్‌పై దాడులు జరిగితే.. యూరప్‌కు తిరిగి యూఎస్ సాయం చేయాల్సివస్తోందని, అది తనకు ఇష్టం లేదని చాట్‌లో తెలిపారట. అయితే, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్ , హెగ్సెత్‌లు యెమెన్‌పై దాడులు చేసేంత సామర్థ్యం అమెరికాకు మాత్రమే ఉందన్నారని గోల్డ్‌బర్గ్ తెలిపారు. గోల్డ్‌బెర్గ్ తనకు తెలిసిన ఈ ప్రణాళికను గురించి ముందుగానే బయటపెట్టకపోవడం గమనార్హం. ఇక, ఈ ప్రణాళిక లీకైన అంశంపై ట్రంప్ స్పందిస్తూ.. దీనిపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. జాతీయ భద్రతా మండలి ప్రతినిధి బ్రియాన్ హ్యూస్ స్పందిస్తూ.. గ్రూప్‌చాట్‌లోకి అనుకోకుండా జర్నలిస్టు ఎలా వచ్చారనే దానిపై విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ భద్రతా ఉల్లంఘనను డెమోక్రట్లు తీవ్రంగా ఖండించారు. ఇటీవల మిలిటరీ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి జరిగిన ఉల్లంఘనల్లో ఇది అతిపెద్దదని ఒక సెనేట్ పేర్కొనగా.. ట్రంప్ పాలకవర్గం అజాగ్రత్త వల్లే ఇది జరిగిందని మరొకరు వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ నౌకలపై దాడుల్ని పునరుద్ధరిస్తామని ప్రకటించిన యెమెన్ తిరుగుబాటు దళం హూతీలపై అమెరికా ఇటీవల పెద్దఎత్తున దాడి చేసింది. ‘ఉగ్రవాద స్థావరాలు, ఉగ్ర నేతలపై మన ధీరులైన యోధులు గగనతల దాడులు చేస్తున్నారు. మన నౌకా స్థావరాలు, వాయుస్థావరాలు, నౌకాదళాలను పరిరక్షించుకునేందుకు పాటుపడుతున్నారు. స్వేచ్ఛాయుత నౌకాయాన వాణిజ్యాన్ని పునరుద్ధరించడానికి పాటుపడుతున్నారు’ అని ట్రంప్ తెలిపారు. ప్రపంచంలో ఎక్కడైనా జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, నౌకాదళ నౌకలు స్వేచ్ఛగా వెళ్లకుండా ఏ ఉగ్రశక్తీ ఆపజాలదని స్పష్టంచేశారు. హూతీలకు మద్దతు ఇవ్వడాన్ని నిలిపివేయాలని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ దాడుల్లో 50 మందికి పైగా మృతిచెందగా.. అనేకమంది గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

## వల్లభనేని వంశీ రిమాండ్ పొడిగింపు

**హైదరాబాద్, మార్చి 25 :** మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీకి విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టు రిమాండ్ పొడిగించింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏప్రిల్ 8 వరకు రిమాం డ్‌ను పొడిగిస్తూ కోర్టు ఆదేశించింది. ఆయనతో పాటు మరో నలుగురు నింది తులను పోలీసులు కోర్టులో హాజరుపర్చా రు. ఏ-1 వల్లభనేని వంశీ మోహన్, ఏ-4 గంటా వీర్రాజు, ఏ-7 ఎలినేని వెంకట శివరామకృష్ణ ప్రసాద్, ఏ-8 నిమ్మల లక్ష్మీపతి, ఏ-10 వేల్పూరు వంశీలను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. దీంతో వీరికి ఏప్రిల్ 8 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. విచారణ సమయంలో వంశీని న్యాయాధికారి నేరుగా పలు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. జైల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు న్యాయాధికారి. గతంలో అనారోగ్యం దృష్ట్యా వేసిన పిటిషన్‌లపై మంచంతో పాటు పరుపు, దిండు కూడా అనుమతిస్తూ కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయనే దానిపై న్యాయాధికారి ఆరా తీయగా సింగిల్ బ్యారెక్‌లో ఉన్నందున ఇబ్బందిగా ఉందని, వేరే బ్యారెక్ మార్చాలని లేదా.. ఇప్పటికే తనతో పాటు రిమాండ్‌లో ఉన్న వారిలో ఒకరిని కాని ఇద్దరిని కానీ ఉంచే వెసులుబాటు కల్పించాలని న్యాయాధికారికి వంశీ విజ్ఞప్తి చేశారు.



# బోణీ కొట్టిన పంజాబ్

## పోరాడి ఓడిన గుజరాత్..

**అహ్మదాబాద్:** ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. సొంత మైదానంలో గుజరాత్ టైటాన్స్ జట్టు పోరాడి ఓడింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గెలుపొందింది. 244 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. ఆ జట్టులో సాయి సుదర్శన్ (74, 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సులు), శుభ్‌మన్ గిల్ (33, 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), జోస్ బట్లర్ (54, 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), రుథర్‌ఫోర్డ్ (46, 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) దూకుడుగా ఆడినప్పటికీ భారీ లక్ష్యం కావడంతో ఓటమి చవిచూసింది. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 2, మాక్స్‌వెల్, యాన్సెన్ ఒక్కో వికెట్ తీశారు.

### చెలరేగిన శ్రేయస్, శశాంక్..

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 243 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (97, 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సులు) త్రుటిలో శతకం మిస్ చేసుకున్నాడు. భారీ షాట్లతో స్కోరుబోర్డును పరుగెత్తిం చాడు. ఆఖర్లో శశాంక్ సింగ్ (44, 16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) మెరుపు ప్రదర్శన చేశాడు. 19 ఓవర్లు పూర్తి అయ్యేసరికి 97 పరుగులకు చేరుకున్న శ్రేయస్‌కు చివరి ఓవర్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆఖరి ఓవర్‌లో స్ట్రైకింగ్‌లో ఉన్న శశాంక్ ఏకంగా ఐదు ఫోర్లు కొట్టాడు. మ్యాచ్ ప్రారంభంలో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (47, 23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) బ్యాట్ ఝుళిపించాడు. మ్యాక్స్‌వెల్ (0) నిరాశపర్చాడు. సాయి కిశోర్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతికే అతడు ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ 5(8), అజ్మతుల్లా ఒమర్జాయ్ 16(15), స్టొయినిస్ 20(15) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో సాయికిశోర్ 3 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రబాడ, రషీద్ ఖాన్ తలో వికెట్ తీశారు.



# టీమ్‌ఇండియాకు ఎంపికవడం నా చేతిలో లేదు : సిరాజ్

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మహ్మద్ సిరాజ్ టీమ్‌ఇండియాలో పునరాగమనం గురించి మాట్లాడాడు. భారత జట్టుకు ఎంపికవడం తన చేతిలో ఏమీ లేదన్నాడు. తన ఫోకస్ అంతా చక్కగా బౌలింగ్ చేయడంపైనే ఉంటుందని వివరించాడు. తన టీమ్ విజయం కోసం వికెట్లు తీయడంపైనే తన దృష్టి ఉంటుందని చెప్పాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 31.15 సగటుతో 20 వికెట్లు పడగొట్టినప్పటికీ సిరాజ్‌కు ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే అవకాశం దక్కలేదు. సెలక్షన్ గురించి ఆలోచించడం తన ఆటతీరుపై ప్రభావం చూపిస్తోందన్నాడు. అందుకే అప్పటి నుంచి తన చేతిలో లేని విషయాల గురించి ఆలోచించడం మానేశా అని వివరించాడు. 'జట్టుకు ఎంపిక అనేది నా నియంత్రణలో లేని వ్యవహారం. వికెట్లు తీయడం, టీమ్ విజయం కోసం కృషి చేయడం ఒక్కటే నా చేతిలో ఉంది. అందుకోసం నేను వందకు వందశాతం కృషి చేస్తా. సెలక్షన్ గురించి ఆలోచిస్తూ కూర్చుంటే నా ఆటతీరు దెబ్బతింటోంది. టీ 20 వరల్డ్ కప్‌లో ఎంపిక కోసం ఆలోచించా. కానీ చక్కగా బౌలింగ్ చేయలేకపోయా. అప్పుడే నాకు ఓ విషయం అర్థమైంది... నా చేతుల్లో లేని అంశాల గురించి అనవసరంగా ఆలోచించవద్దని. కేవలం ఆటతీరు మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాను' అని సిరాజ్ మీడియాతో అన్నాడు.




# శ్రేయస్‌కు బీసీసీఐ కాంట్రాక్టు ఖాయం



బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులకు సంబంధించిన జాబితా విడుదల కావాల్సిఉంది. ఈనేపథ్యంలో క్రీడా పండితులు పలు ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కాంట్రాక్టు కోల్పోయిన శ్రేయస్ అయ్యర్... ఈసారి కచ్చితంగా దక్కించుకునే అవకాశాలే కనిపిస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ అనంతరం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఈ నేపథ్యంలో వారికి ఈసారి ఎ ప్లస్ కేటగిరిలో స్థానం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఈ విభాగంలో కొనసాగాలంటే ఆటగాళ్లు టెస్టులు, వన్డేలు, టీ20లు ఇలా ఈ మూడు ఫార్మాట్లలోనూ ఆడాలి. దీంతో ఈ ముగ్గురు ఎ కేటగిరి కింద బీసీసీఐ కాంట్రాక్టులు పొందనున్నారు. జస్ప్రీత్ బుమ్రా మాత్రం గత ఏడాదిలానే ఈ ఏడాది కూడా ఎ ప్లస్ కేటగిరిని సొంతం చేసుకోనున్నాడు. నిరుడు ఎ కేటగిరిలో ఉన్న రవిచంద్రన్‌అశ్విన్ ఈసారి కాంట్రాక్టు జాబితా నుంచి నిష్క్రమిస్తాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు అతడు రిటైర్మెంట్ ప్రకటించడమే దీనికి కారణం. ఇంగ్లాండ్‌తో టీ 20 సీరీస్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన అక్షర్‌పటేల్ ఈసారి కేటగిరి బి నుంచి ఎ కు వచ్చే అవకాశం ఉంది. గత సంవత్సరం బీసీసీఐ ఆగ్రహానికి గురై, అనూహ్య పరిస్థితుల్లో శ్రేయస్ అయ్యర్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాడు. ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో తన సమయోచిత బ్యాటింగ్‌తో టీమ్‌ఇండియా విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. దీంతో శ్రేయస్ తిరిగి కాంట్రాక్ట్‌ను పొందడం ఖాయంగా కనిపిస్తోంది. యశస్వి జైశ్వాల్ కూడా కేటగిరి బి నుంచి ప్రమోషన్ పొందే అవకాశాలున్నాయి. ఆకాశ్‌దీప్, సర్ఫరాజ్‌ఖాన్ కేటగిరి సి లో స్థానం దక్కించుకోవచ్చు. నితీశ్‌కుమార్ రెడ్డి పేరు కూడా సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో కనిపించొచ్చు. శార్దూల్ ఠాకూర్, రుతురాజ్ గైక్వాడ్ కాంట్రాక్టులో కొనసాగడం సందేహంగానే ఉంది. ఏదేమైనప్పటికీ సెలక్షన్ కమిటీ, ప్రధాన కోచ్‌తో సంప్రదింపుల తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తుది జాబితాను అపెక్స్ కౌన్సిల్ ముందు ఆమోదం కోసం పెట్టనున్నాడు. అప్పుడే అధికారికంగా పూర్తి సమాచారం తెలియనుంది.

# ఆ ధైర్యంతోనే ఆటగాళ్లు భయం లేకుండా ఆడుతున్నారు: ధోనీ



చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి ఎంఎస్ ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ని సమర్థించాడు. అయితే, ఈ రూల్ వచ్చిన కొత్తలో తనకు అస్సలు నచ్చలేదని, ఇది అవసరం లేదని అనిపించిందని పేర్కొన్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ని ఐపీఎల్ 2023 సీజన్‌లో ప్రవేశపెట్టారు. ఈ నియమం వల్ల అదనంగా ఒక బ్యాటర్ లేదా బౌలర్‌ను తీసుకుంటూ జట్లు ప్రయోజనం పొందుతున్నాయి. ముఖ్యంగా ఎక్స్ ట్రా బ్యాటర్‌ను బరిలోకి దింపి టీమ్ భారీ స్కోరు సాధించేలా చేస్తున్నాయి. గత సీజన్‌లో 41 సార్లు 200కుపైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. కానీ, ఇంపాక్ట్ ప్లేయర్ వల్ల భారీ స్కోర్లు నమోదు కావడం లేదని, ఆటగాళ్ల మైండ్ సెట్ మారడంతోనే ఇది సాధ్యమవుతోందని ధోనీ పేర్కొన్నాడు. 'ఈ రూల్‌ను అమలు చేసిన కొత్తలో నాకైతే ఇది అనవసరమనిపించింది. ఒక విధంగా ఈ రూల్ నాకు హెల్ప్ అవుతుంది. కానీ, నాకు దీని అవసరం లేదు. నేను ఇప్పటికీ వికెట్ కీపింగ్ చేస్తాను. కాబట్టి నేను ఇంపాక్ట్ ప్లేయర్‌ని కాదు. ఆటలో పాలుపంచుకోవడం నాకు ఇష్టం. ఈ రూల్ వల్ల మ్యాచ్‌ల్లో మరిన్ని భారీ స్కోర్లు నమోదవుతాయని చాలామంది అంటున్నారు. నేనైతే పిచ్ పరిస్థితులు,ప్లేయర్ల కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా భారీ స్కోర్లకు కారణమని నమ్ముతున్నా. అదనపు బ్యాటర్ ఉన్నాడనే ధైర్యంతో ఆటగాళ్లు భయం లేకుండా మరింత దూకుడుగా ఆడుతున్నారు. అలా అని టీమ్స్ నలుగురైదుగురు ఎక్స్ ట్రా బ్యాటర్లను ఆడించట్లేదు. కానీ, ఆ అదనపు బ్యాటర్ ఉన్నాడనే భరోసాతో మాత్రం ముందుగా వచ్చే బ్యాటింగ్ చేసే ప్లేయర్ల ఆటతీరును మార్చేస్తోంది. టీ20 క్రికెట్ ఇలాగే మారిపోయింది' అని ధోనీ వివరించాడు. ప్రస్తుతం ఐపీఎల్ 2025లో ధోనీ సీఎస్కేకు ఆడుతున్న సంగతి తెలిసిందే. 43 ఏళ్ల వయసులోనూ వికెట్‌కీపర్‌గా అదరగొడుతున్నాడు. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్‌ను మెరుపు స్టంపింగ్‌తో పెవిలియన్‌కు పంపాడు. ఛేదనలో విన్నింగ్ షాట్ కొట్టే అవకాశం వచ్చినా రెండు డాట్ బాల్స్ ఆడి రచిన్ రవీంద్రకు మ్యాచ్ ముగించే బాధ్యత అప్పగించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ మ్యాచ్ మార్చి 27న చెన్నై వేదికగా జరగనుంది.




## జియో యూజర్లకు గుడ్‌న్యూస్

### ఈ ప్లాన్లపై 50 జీబీ క్లౌడ్ స్టోరేజీ

ప్రముఖ టెలికాం సంస్థ జియో తమ యూజర్లకు ఉచితంగా ఏఐ క్లౌడ్ స్టోరేజీని అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్లపై 50 జీబీ క్లౌడ్ స్టోరేజీని ఉచితంగా ఇస్తోంది. గతేడాది జరిగిన రిలయన్స్ ఏజీఎంలో 100 జీబీ క్లౌడ్ స్టోరేజీని ఉచితంగా అందించనున్నట్లు ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ప్లాన్లను ఈ స్టోరేజీ అందిస్తోంది. రూ.299, అంతకంటే ఎక్కువ మొత్తంతో రీఛార్జి చేసుకున్న వారికి ఈ క్లౌడ్ స్టోరేజీని జియో అందిస్తోంది. అంతకంటే తక్కువ మొత్తం రీఛార్జి చేసిన వారికి 5 జీబీ డేటా మాత్రమే ఫ్రీ ట్రయల్ రూపంలో లభి స్తోంది. రూ.349, రూ.449, రూ.649, రూ.749, రూ.1549 పోస్ట్‌పెయిడ్ ప్లాన్లలో అంతర్భాగంగా క్లౌడ్ స్టోరేజీని ఇస్తోంది. ఇతర టెలికాం నెట్‌వర్క్ యూజర్లకూ ప్రమోషనల్ స్టోరేజీలో భాగంగా నిర్ణీత కాలంపాటు 50 జీబీ క్లౌడ్ స్టోరేజీని అందిస్తున్నట్లు జియో క్లౌడ్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

**ఎలా ఉపయోగించాలి?**

గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాపిల్ స్టోర్‌లోకి వెళ్లి జియో క్లౌడ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి. అక్కడ మీ జియో నంబర్‌తో లాగిన్ అవ్వండి. ఆపై అప్‌లోడ్ బటన్‌పై క్లిక్ చేసి మీరు అప్‌లోడ్ చేయాలనుకుంటున్న ఫైళ్లను ఎంపిక చేసుకోండి. డెస్క్‌టాప్‌లో అయితే జియో క్లౌడ్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫైళ్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. గూగుల్ స్టోరేజీ నిండిపోయిన వారు జియో అందిస్తున్న క్లౌడ్ స్టోరేజీలోకి లార్జ్ ఫైల్స్‌ను మూవ్ చేయడం ద్వారా స్పేస్ పొందొచ్చు.

# ఆరంభ లాభాలు ఆవిరి

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు ఫ్లాట్‌గా ముగిశాయి. కొన్ని దేశాలకు టారిఫ్‌ల నుంచి ఊరట కల్పిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇవ్వడంతో దేశీయ సూచీలు ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఇంట్రాడేలో ఆరంభ లాభాలు ఆవిరై నష్టాల్లోకి వెళ్లిన సూచీలు.. చివరికి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఏడో రోజూ సూచీలు గ్రీన్‌లో ముగియడం గమనార్హం. ఐటీ షేర్లు రాణించాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1 శాతానికి పైగా నష్టాలు ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 78,296.28 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,984.38) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,741.69 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అమ్మకాల ఒత్తిడితో గరిష్ఠాల నుంచి దాదాపు వెయ్యిపాయింట్ల మేర పతనమైన సూచీ.. 77,745.63 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 32.81 పాయింట్ల లాభపడి 78,017.19 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.30 పాయింట్ల లాభంతో 23,668.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 16 పైసలు క్షీణించి రూ.85.77గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. జొమాటో, ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.46 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3027 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## ఐఫోన్ 16 ప్రో డిజైన్‌తో.. లావా నుంచి ఎంట్రీ లెవల్ ఫోన్

దేశీయ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ లావా.. ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్ల కోసం 'షార్క్' పేరిట కొత్త సిరీస్‌ను ప్రకటించింది. ఈ బ్రాండ్ కింద రూ.9 వేల లోపు ఫోన్లు తీసుకురానుంది. ఇందులోభాగంగా 'షార్క్' పేరిట కొత్త స్మార్ట్‌ఫోన్‌ను మంగళవారం మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధరను రూ.6,999గా నిర్ణయించింది. కాకపోతే ఇది 4జీ స్మార్ట్‌ఫోన్. తొలిసారి స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసేవారిని దృష్టిలో పెట్టుకొని ఈ ఫోన్‌ను తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. వెనకవైపు కెమెరా బంప్ చూస్తే అచ్చం యాపిల్ ఐఫోన్ 16 ప్రోను పోలి ఉంటుంది. లావా షార్క్‌లో 6.67 అంగుళాల హెచ్‌డీ పంచ్ హోల్ డిస్‌ప్లే ఇచ్చారు. ఫేస్ అన్‌లాక్‌తో పాటు సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంది. ఇందులో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. ఇది ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. బాక్సుతో పాటు ఛార్జర్‌ను ఇస్తున్నారు. లావా షార్క్‌లో యూనిసోక్ టీ606 ఆక్టాకోర్ ప్రాసెసర్‌ను అమర్చారు. 4జీబీ ర్యామ్‌తోపాటు 4 జీబీ వర్చువల్ ర్యామ్‌తో, 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో వస్తోంది. 256జీబీ వరకు పెంచుకోవచ్చు. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 14తో ఈ ఫోన్ పనిచేస్తుంది. అప్‌డేట్స్‌కు సంబంధించిన వివరాలు కంపెనీ వెల్లడించలేదు. వెనకవైపు 50 ఎంపీ కెమెరా, 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. ఏఐ మోడ్, పోర్ట్రెయిట్ మోడ్, ప్రో మోడ్, హెచ్‌డీఆర్ ఎన్‌హ్యాన్స్ ఫొటోగ్రఫీ ఎక్స్‌పీరియన్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. టైటానియం గోల్డ్, స్టెల్త్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. లావా రిటైల్ స్టోర్లలో ఈ ఫోన్ లభిస్తుంది. త్వరలో మరిన్ని ఫోన్లు ఈ సిరీస్‌లో తీసుకురాబోతున్నట్లు కంపెనీ తెలిపింది. ఇంటివద్దే సర్వీస్ చేసి ఇస్తామని చెబుతోంది.




## అమ్మకాల్లో టెస్లాను దాటేసిన బీవైడీ

చైనా కార్ల తయారీ సంస్థ బీవైడీ నుంచి అమెరికాకు చెందిన టెస్లాకు తీవ్రమైన పోటీ వస్తోంది. తాజాగా వార్షిక ఆదాయాల్లో మస్క్ నేతృత్వంలోని సంస్థను మించింది. షెంజెన్ కేంద్రంగా పనిచేసే బీవైడీ గతేడాది 107 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించినట్లు పేర్కొంది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 29శాతం అధికం. ఇక ఇదేకాలంలో టెస్లాకు వచ్చిన ఆదాయం 97.7 బిలియన్ డాలర్లే కావడం గమనార్హం. బీవైడీ విక్రయాల్లో హైబ్రీడ్ వాహనాల జోరు కొనసాగుతోంది. బీవైడీ గతేడాది టెస్లా విక్రయించిన విద్యుత్తు వాహనాల సంఖ్యకు (17.9 లక్షల) దాదాపు సమానంగా 17.6 లక్షల వాహనాలను అమ్మింది. కానీ, దీనిలో హైబ్రీడ్ వాహనాల విభాగంలో మాత్రం భారీ పెరుగుదలను నమోదు చేసింది. ఈసారి ఆ కంపెనీ ఏకంగా 43 లక్షల వాహనాలను ప్రపంచవ్యాప్తంగా విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. క్విన్ ఎల్‌గా పిలిచే ఈ కారు ధర టెస్లా మోడల్ 3లో దాదాపు సగమే ఉంది. ఇటీవలే ఈ చైనా సంస్థ టెస్లా మోడల్ 3కి పోటీగా ఓ చౌక మోడల్ కారును తీసుకొచ్చింది. చైనా ఈవీ మార్కెట్లో దూసుకెళ్లేందుకు వీలుగా దీనిని తీసుకువచ్చినట్లు సమాచారం. దీంతోపాటు బీవైడీ ఈ ఏడాది సరికొత్తగా ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీలను ముందుకుతీసుకొచ్చింది. కేవలం ఐదు నిమిషాలు ఛార్జింగ్ చేస్తే.. 400 కిలోమీటర్లు దూసుకుపోవచ్చు. అదే సమయంలో టెస్లాలో 15 నిమిషాలు ఛార్జింగ్ పెట్టాల్సిరావచ్చు. ఇక బీవైడీ బేసిక్ మోడల్స్‌లో కూడా ఉచితంగా సరికొత్త డ్రైవర్ అసిస్టెన్స్‌ను సిద్ధం చేసింది. దీనికి 'గాడ్స్ ఐ' అని పేరు పెట్టింది. గత కొంతకాలంగా టెస్లా సారథి మస్క్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు నెరపడంతో కూడా ఈ కంపెనీ కార్ల విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మరోవైపు చైనా తయారీ కార్లపై పశ్చిమదేశాల్లో భారీగా పన్నులు విధిస్తున్నారు.

## 'లూసిఫర్ 2'.. స్క్రిప్ట్ రాసేటప్పుడే

# ఆ అనుమానం కలిగింది

### పృథ్వీరాజ్ సుకుమారన్



'లూసిఫర్ 2: ఎంపురాన్' అంటూ మరోసారి బాక్సాఫీస్ ను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఈ సినిమా ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో మలయాళ చిత్ర పరిశ్రమ నష్టాల్లో ఉందంటూ వచ్చిన వార్తల గురించి మాట్లాడారు. 'లూసిఫర్ 2' గురించి కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఇప్పటివరకూ మలయాళ పరిశ్రమలో ఎవరూ ఈ స్థాయిలో సినిమా నిర్మించలేదు. దీని స్క్రిప్ట్ రాసేటప్పుడే సినిమా తెరకెక్కుతుందా? అని అనుమానం కలిగింది. దీని కథ విషయంలో ఎక్కడా రాజీ పడలేకపోయాను. భారీగా రాసుకున్నాను. ఇది సాధ్యమైందంటే కేవలం మోహన్‌లాల్, నిర్మాతలే కారణం. దీనికి దర్శకత్వం వహించే సమయంలో ఒత్తిడికి గురయ్యాను. మొదటి భాగం భారీ విజయం సాధించింది కాబట్టి అందరూ రెండో పార్ట్‌పై అంచనాలు పెట్టుకుంటారు. వాటిని అందుకోవాలనే ఆలోచన ఎప్పుడూ ఉండేది. ఒక అభిమానిగా మోహన్‌లాల్ సినిమాకు దర్శకత్వం వహించాను. ఫ్యాన్స్ ఆయన్ని ఎలా చూడాలనుకుంటున్నారో అలానే చూపించాను" అని చెప్పారు. గత కొన్ని రోజులుగా మలయాళ చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటోన్న సంక్షోభం గురించి పృథ్వీరాజ్ స్పందించారు. "ఎంత విజయం సాధించిన సినిమానైనా ప్రేక్షకులు ఒక ఏడాదికి మించి గుర్తుపెట్టుకోలేరు. సినీ పరిశ్రమ అంటేనే రిస్క్ ఎక్కువ. లాభనష్టాలు రెండూ ఎక్కువగా ఉండే పరిశ్రమ ఇది. ఈ విషయం అందరికీ తెలుసు. ఏడాదిలో 100 సినిమాలు తెరకెక్కిస్తే.. వాటిలో 80 హిట్ అయినట్లు చరిత్రలో లేదు. ఏ ఇండస్ట్రీలోనూ ఇలా జరగలేదు. ఏ సినిమా హిట్ అవుతుంది.. ఏది కాదో ఎవరూ చెప్పలేరు. సినిమా విజయం సాధిస్తే లాభాలు భారీగా వస్తాయి కాబట్టి వ్యాపారవేత్తలకు ఈ ఇండస్ట్రీపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది" అని చెప్పారు. ఇక మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ రూపొందించిన చిత్రమే 'లూసిఫర్ 2: ఎంపురాన్'. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకురానుంది.



## అందుకే రష్మిక 'రాబిన్‌హుడ్' చేయలేదు : శ్రీలీల

'రాబిన్‌హుడ్'లాంటి ఫన్ ఉన్న సినిమాని తన కెరీర్‌లో ఇప్పటివరకూ చేయలేదని, ఇదొక ఫుల్ ఎంటర్‌టైనర్ అని కథానాయిక శ్రీలీల అన్నారు. నితిన్‌తో కలిసి ఆమె నటించిన చిత్రమిది. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శ్రీలీల పంచుకున్న ఆసక్తికర విషయాలు.. "రాబిన్‌హుడ్'లో నేను విదేశాల నుంచి ఇండియా వచ్చిన అమ్మాయిగా కనిపిస్తా. ఈ ప్రపంచమంతా తన చుట్టూనే ఉంటుందనే పాత్ర నాది. క్యారెక్టరైజేషన్ చాలా క్యూట్‌గా ఉంటుంది. నిజానికి ఈ పాత్రను రష్మిక చేయాలి. ఆమెకు కూడా చాలా బాగా నచ్చింది. అయితే, డేట్స్ కుదరకపోవడం వల్ల చేయలేదు. 'పుష్ప2' షూటింగ్‌లో కలిసినప్పుడు 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. నాకు కూడా చాలా నచ్చి చేశా" "నితిన్‌తో పనిచేయడం చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఆయన ఫ్యామిలీ పర్సన్‌లా ఉంటారు. చాలా క్వాలిటీతో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. నితిన్‌తో నాది హిట్ పెయిర్ అవుతుందని నమ్మకం. ఇక వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ గారితో ట్రాక్ షూట్ చేస్తున్నప్పుడే నవ్వాగలేదు. వెన్నెల కిషోర్ కామెడీని చాలా ఎంజాయ్ చేశా. మా ఇద్దరి మధ్య వచ్చే సీన్స్ మంచి వినోదాన్ని పంచుతాయి"



## ప్రభాస్ కార్ కలెక్షన్ చూస్తే మతిపోవాల్సిందే.

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. ప్రస్తుతం రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తోన్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో డార్లింగ్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్ ఆకట్టుకుంటున్నాయి. హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ మూవీలో ప్రభాస్ సరికొత్త పాత్రలో కనిపిస్తుండడంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని తెగ వెయిట్ చేస్తున్నారు ఫ్యాన్స్. త్వరలోనే ఈ సినిమా అడియన్స్ ముందుకు రానుంది. అలాగే తన కొత్త ప్రాజెక్ట్స్ పై ఫోకస్ పెట్టాడు డార్లింగ్. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ప్రభాస్ లైఫ్ స్టైల్, కార్ కలెక్షన్, రెమ్యునరేషన్ గురించి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. ప్రభాస్ ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ.100 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటున్నాడు. నివేదికల ప్రకారం డార్లింగ్ ఆస్తి రూ.240 కోట్లకు పైగా ఉంటుందట. ఇక ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌కు దాదాపు రూ.2 కోట్లు తీసుకుంటాడని సమాచారం. అంతేకాకుండా ప్రభాస్ వద్ద కార్ కలెక్షన్ చూస్తే దిమ్మతిరిగిపోద్ది. ప్రస్తుతం డార్లింగ్ వద్ద రోల్స్ రాయిస్ ఫాంటమ్ కారు ఉంది. ఈ కారు విలువ రూ.8 కోట్లు. ఇండస్ట్రీలో అక్షయ్ కుమార్, షారుఖ్ ఖాన్, అమితాబ్ బచ్చన్ వద్ద మాత్రమే ఈ కారు ఉందట. అలాగే డార్లింగ్ దగ్గర రూ.2.08 కోట్ల విలువైన జాగ్వార్ కారు సైతం ఉంది. అలాగే రూ.1 కోటి విలువైన రేంజ్ రోవర్ స్పోర్ట్స్ కారుతోపాటు.. డార్లింగ్ గ్యారేజీలో లాంబోర్గినీ అవెంటడోర్ రోడ్ స్టర్ కారు ఉంది. దీని విలువ రూ.6 కోట్లు ఉంటుంది. అలాగే రూ.68 లక్షల విలువైన %దీవీఔ శ%3 ఉన్నాయి. ప్రస్తుతం రాజాసాబ్ సినిమాతోపాటు డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్షన్ లో ఒక సినిమా.. సలార్ 2 చిత్రాల్లో నటిస్తున్నాడు డార్లింగ్.



## నటుడు, పవన్ కల్యాణ్ గురువు షిహాన్ హుసైని కన్నుమూత

ప్రముఖ కోలీవుడ్ నటుడు షిహాన్ హుసైని (60) కన్నుమూశారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు సామాజిక మాధ్యమాల వేదికగా ధ్రువీకరించారు. హుసైని మృతిపై పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. కాగా.. ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్‌కల్యాణ్‌కు హుసైని మార్షల్ ఆర్ట్స్, కరాటే, కిక్ బాక్సింగ్‌లో శిక్షణ ఇచ్చారు. షిహాన్ హుసైని 1986లో విడుదలైన 'పున్నగై మన్నన్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు. పలు చిత్రాల్లో నటించిన ఆయనకు విజయ్ హీరోగా నటించిన 'బద్రి' సినిమా గుర్తింపునిచ్చింది. ఆర్చరీలోనూ శిక్షకుడిగా ఉన్న ఆయన ఆ రంగంలో 400 మందికి పైగా విద్యార్థులను తయారుచేశారు.



## పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన అమీజాక్సన్

బాలీవుడ్ నటి అమీ జాక్సన్ మరోసారి తల్లైంది. పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని అమీ జాక్సన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. బాబుకు ఆస్కార్ అలెగ్జాండర్ వెస్ట్‌విక్ అని పేరు పెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు భర్త, బిడ్డతో దిగిన ఫోటోను పంచుకుంది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు, అభిమానులు అమీ జాక్సన్ జంటకు కంగ్రాట్స్ చెబుతూ పోస్టులు పెడుతన్నారు. కాగా, అమీ జాక్సన్ సినిమాల్లోకి వచ్చే ముందు మోడల్‌గా రాణించింది. 2010లో తమిళంలో 'మద్రాస్‌పట్టణం' మూవీతో చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో ప్రతీక్ బబ్బర్ సరసన 'ఏక్ దీవానా థా'తో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. 2014లో తెలుగులో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ నటించిన 'ఎవడు' చిత్రంలో నటించింది. ఆ తర్వాత 2018లో సూపర్‌స్టార్ రజనీకాంత్ రోబో 2. చిత్రంతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. అలాగే చియాన్ విక్రమ్ 'ఐ'మూవీలోనూ మెరిసింది. ప్రస్తుతం అమ్మడు తెలుగు సినిమాలకు దూరమైంది. గతేడాది ఆగస్టులో తన ప్రియుడు, హాలీవుడ్ నటుడు ఎడ్ విస్ట్‌విక్‌ను రెండో వివాహం చేసుకుంది. దక్షిణ ఇటలీలోని 16వ శతాబ్దం నాటి కాస్టెల్లో రోకో కోటలో ఆమె ఎడ్ వెస్ట్‌విక్‌ను మనువాడింది. అమీజాక్సన్ గతంలో జార్జ్ పనయోట్టు అనే బిజినెస్‌మెన్‌తో ప్రయాణం నడిపి.. 2019లో ఎంగేజ్‌మెంట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత పెళ్లి కాకుండానే ఓ బిడ్డకు జన్మనించింది. వీరి ప్రేమ ఎక్కువ కాలం నిలువలేదు. చివరకు 2022లో పనయోట్టుతో తనబంధం ముగిసిందని ప్రకటించింది. అప్పటి నుంచి కుమారుడు ఆండ్రెస్‌తో ఒంటరిగానే ఉంటూ వచ్చింది. ఆ తర్వాత అమీ జాక్సన్ హాలీవుడ్ స్టార్ వెస్ట్‌విక్‌తో ప్రేమలో పడింది.




## ఆ హీరోతో నటించడం ఎంతో అదృష్టం : మాళవిక

తమిళంలో అగ్ర హీరోల సరసన నటించి ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటిం గ్ సందర్భంగా ప్రభాస్ మంచితనం, సహృదయతకు తాను ఫిదా అయిపోయానని, ముఖ్యంగా ఆయన ఇంటి నుంచి తీసుకొచ్చే ఫుడ్ అద్భుతమని గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్‌ను పొగడ్తల్లో ముంచెత్తిందీ భామ. తాజాగా మరోసారి ప్రభాస్ గురించి మాట్లాడింది. ప్రభాస్ వంటి గ్రేట్ పర్సన్‌తో నటించడం తన అదృష్టమని, తన కెరీర్‌లోనే మైలురాయిలా నిలిచే చిత్రమవుతుందని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. 'నిజంగా ఈ సినిమా ఛాన్స్ రావడం లక్కీగా ఫీలవుతున్నా. షూటింగ్ అంతా సరదాగా సాగిపోతున్నది. ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి మించిన ఆనందం ఏముంటుంది? ఈ సినిమాను జీవితాంతం గుర్తుంచుకుంటా' అని ఆనందం వ్యక్తం చేసింది మాళవిక మోహనన్. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన 'రాజా సాబ్' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

## క్రేజీ ఫొటోలను షేర్ చేసిన షాలిని

షాలిని పాండే తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ బ్యూటీ 1993 సెప్టెంబర్ 23న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించింది. జబల్‌పూర్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన షాలిని, చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చింది. ఇంజనీరింగ్ చదువుతున్న రెండవ సంవత్సరం నుంచే ఆమె నాటకాల్లో నటించడం ప్రారంభించింది. షాలిని పాండే 2017లో విజయ్ దేవరకొండ నటించిన తెలుగు చిత్రం అర్జున్ రెడ్డి ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఈ చిత్రంలో ఆమె ప్రీతి అనే పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా భారీ విజయం సాధించడంతో షాలినికి విశేష గుర్తింపు లభించింది. తెలుగు మాట్లాడడం రానప్పటికీ, ఈ చిత్రంలో తన పాత్రకు ఆమె స్వయంగా డబ్బింగ్ చెప్పుకుంది. అర్జున్ రెడ్డి తర్వాత షాలిని తెలుగులో మహానటి, 118, ఇద్దరి లోకం ఒకటే, నిశ్శబ్దం వంటి చిత్రాల్లో నటించింది. ఆమె తమిళ సినిమా 100% కాదల్ లో కూడా కనిపించింది. హిందీలో జయేష్‌భాయ్ జోర్దార్, మహారాజ్ చిత్రాలతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. మహారాజ్ చిత్రంలో ఆమె నటన, ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే షాలిని. రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.



Printed, Published and Owned by RAVU RAJITHA, Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com